Follow: @ANNTELUGU
ANN తెలుగు
11-09-2025
# మహా పత్రిక
గురువారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 278 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## బాసరను అన్నివిధాల అభివృద్ధి చేస్తాం
### మంత్రి జూపల్లి
- ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం
- 190 కోట్లతో ఆలయ మాస్టర్ ప్లాన్ అమలు
- గోదావరి పుష్కరాల కోసం ఇప్పటినుండే ప్రణాళికలు
- ఆలయాభివృద్ధి పై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ
- బాసర పర్యటనలో మంత్రి జూపల్లి హామీలు

వివరాలు 2లో

గురు..గురు

## బీరు, బిర్యానీ అలవాటు చేసిందే కేటీఆర్
- పొన్నం ప్రభాకర్ సంచలన వ్యాఖ్యలు



02

## ఎవరు ఆపినా కేటీఆర్ అరెస్ట్ ఆగదు!
- దోచుకున్న దోపిడీ సొమ్మునంతా కక్కిస్తాం
- రాజకీయ కక్ష సాధింపు చర్యలు లేవు.. చట్ట ప్రకారమే వెళ్తాం
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి హాట్ కామెంట్స్



02

## ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయను
- ఏం చేసుకుంటారో చేసుకోండి
- గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్
- పార్టీ తప్పు చేస్తే ఎదురుతిరుగుతా



02

SRI GOLD
TRUSTED GOLD BUYERS
బంగారం ధరలు

| | |
|---|---|
| 24 క్యారెట్ | 1,10,290 |
| 22 క్యారెట్ | 1,01,100 |
| సిల్వర్ (కేజీ) | 1,30,000 |




## గాంధీ సరోవర్‌కు రక్షణ శాఖ భూములు బదలాయించండి
### రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు సీఎం రేవంత్ రెడ్డి వినతి

**ఢిల్లీ, మహా :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు రక్షణ శాఖ భూములు బదలాయించాలని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో కేంద్ర మంత్రి అధికారిక నివాసంలో బుధవారం సీఎం రేవంత్ రెడ్డి

మిగతా 2లో



# రప్పా రప్పా అంటే చూస్తూ ఊరుకుంటామా?
## ఇక్కడ ఉన్నది సీబీఎన్
- సూపర్ సిక్స్ సూపర్ హిట్ సభలో చంద్రబాబు కామెంట్స్
- దసరా కానుకగా ఆటో డ్రైవర్లకు రూ. 15 వేలు ఇస్తాం
- తెలుగు తమ్ముళ్ల స్పీడు.. జనసేన జోరు.. కమలదళం ఉత్సాహానికి ఎదురుందా?



**అనంతపురం, మహా:** ఫేక్ రాజకీయాలతో మోసం చేయాలని వైకాపా చూస్తోందని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీకి రాకుండా.. రప్పా రప్పా అంటూ రంకెలేస్తున్నారు. రప్పా రప్పా అంటే చూస్తూ ఊరుకుంటామా?.. ఇక్కడ ఉన్నది సీబీఎన్. సోషల్ మీడియాలో అసభ్య పోస్టులు పెట్టిన 10 నిమిషాల్లో పోలీసులు వస్తారు. రాష్ట్రాభివృద్ధి కోసం నేను, పవన్ కల్యాణ్ అకుంఠిత దీక్షతో పనిచేస్తున్నాం.


మిగతా 2లో

# జూబ్లీహిల్స్ బరిలో మాగంటి సునీత
### సన్నాహక సమావేశంలో కేటీఆర్ స్పష్టత
- జూబ్లీహిల్స్ నుండే గులాబీ జైత్రయాత్ర
- గోపినాథ్ కుటుంబానికి అండగా నిలవాలని పిలుపు
- ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఇన్ ఛార్జి బాధ్యతలు



**హైదరాబాద్, మహా :** జూబ్లిహిల్స్ అసెంబ్లీకి జరుగనున్న ఉప ఎన్నికలో బీఆర్ఎస్ తన అభ్యర్థిపై స్పష్టతనిచ్చింది. సిట్టింగ్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరణించడంతో జూబ్లీహిల్స్ ఉపఎన్నిక అనివార్యమైంది. అక్టోబర్ చివరి వారం లేదా నవంబర్ ప్రారంభంలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నిర్వహించనన్నారు. ఈ క్రమంలో జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో బీఆర్ఎస్ అభ్యర్థిగా మాగంటి సునీతను ముందువరుసలో అందరూ మద్దతివ్వాలని కేటీఆర్ విజ్ఞప్తిచేశారు. దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ కుటుంబానికి అందరూ అండగా నిలిచి, గెలుపుకోసం పనిచేయాలని సూచించారు. తెలంగాణ భవన్‌లో బుధవారం వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్ అధ్యక్షతన జూబ్లీహిల్స్ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో గోపీనాథ్ భార్య సునీతతో పాటు.. మాజీ మంత్రి గంగుల కమలాకర్ కూడా పాల్గొన్నారు.

మిగతా 2లో




02

## ఫ్రాన్స్‌ను కుదిపేస్తోన్న ఆందోళనలు
### బ్లాక్ ఎవ్విరిథింగ్ ఉద్యమం.. కొత్త ప్రధాని ఎంపిక కాగానే నిరసనలు



## ఐఫోన్ 17 సీరీస్ లాంచ్

**మహా, టెక్ డెస్క్:** టెక్ ప్రియులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూసిన యాపిల్ అతిపెద్ద ఈవెంట్ ముగిసింది. యాపిల్ పార్క్‌లో ఐఫోన్ 17 ను ఆవిష్కరించింది యాపిల్. ఇందులో మొత్తం 4 మోడల్స్.. ఐఫోన్ 17, ఐఫోన్ ఎయిర్, ఐఫోన్ 17 ప్రో, ఐఫోన్ 17 ప్రో మ్యాక్స్ (ఫ్లాగ్‌షిప్ ఫోన్) పరిచయం చేసింది. ఇదే యాపిల్ ఈవెంట్లో ఫోన్స్‌తో పాటు.. న్యూ జెనరేషన్ ఎయిర్‌పాడ్స్ ప్రో 3, స్మార్ట్ వాచ్ సిరీస్ ఎస్ ఈ 3, 11 వాచ్‌లను పరిచయం చేసింది. ఈ ఐఫోన్స్ అన్నీ ఈ నెల 12 నుంచి బుకింగ్స్ ప్రారంభం కానుండగా.. 19 నుంచి అందుబాటులోకి వస్తాయి. ఐఫోన్ 17 ఎయిర్: ఐఫోన్ చరిత్రలోనే అత్యంత నాజూగ్గా దీనిని రూపొందించారు. కేవలం 5.6 ఎంఎం మందంతో అతిపల్చగా తీసుకొచ్చింది.



## భారత విద్యార్థులకు కెనడా భారీ షాక్!
భారతీయ విద్యార్థులకు వీసా జారీలో కెనడా గ్రాఫ్ డౌన్
వీసా దరఖాస్తుల్లో 80 శాతం వరకు తిరస్కరణ.. జర్మనీకి ఆదరణ

02

నేపాల్‌లో చిక్కుకున్న తెలంగాణ వాసుల కోసం
## ఢిల్లీలో హెల్ప్ లైన్
ముగ్గురు అధికారుల బృందానికి బాధ్యతల అప్పగింత

వివరాలు 2లో





## పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ పై అభిమానంతో కంది శ్రీనివాసరెడ్డి మహా అన్నదానం

**ఆదిలాబాద్, మహా:** పీసీసీ చీఫ్ బొమ్మా మహేష్ కుమార్ గౌడ్ దిగ్విజయంగా తెలంగాణ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులుగా మొదటి సంవత్సరం పూర్తి చేసుకొని దేశంలోనే స్ఫూర్తిదాయక పీసీసీ చీఫ్‌గా, రోల్ మోడల్ గా నిలిచిన నేపథ్యంలో ఆదిలాబాద్ పట్టణంలో "మహా అన్నదానం" కార్యక్రమం ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జ్ కంది శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని, ప్రజాప్రతినిధులను కార్యకర్తలతో, నాయకులతో అనుసంధానించేలా అద్భుతమైన కార్యక్రమాలు నిర్వహించిన ఘనత మహేష్ గౌడ్ కే దక్కుతుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో అమలవుతున్న సంక్షేమపథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళేలా పీసీసీ చీఫ్ ఎప్పటికపుడు దిశానిర్దేశం చేస్తున్నారన్నారు. కులగణన టర్నింగ్ పాయింట్ అన్నారు.



# రప్పా రప్పా అంటే చూస్తూ ఊరుకుంటామా?

(మొదటిపేజీ తరువాయి)

మా సంకల్పానికి నరేంద్రమోదీ అండగా ఉన్నారు'' అని చంద్రబాబు తెలిపారు. బుధవారం అనంతపురంలో ఏర్పాటు చేసిన సూపర్ సిక్స్ సూపర్ హిట్ బహిరంగ సభలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. ఈ సభ రాజకీయాలు, ఓట్ల కోసం కాదన్నారు. 15 నెలల పాలనలో ఇచ్చిన మాట నిలబెట్టున్నామని చెప్పేందుకే ఈ సభను ఏర్పాటు చేసినట్లు సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. సూపర్ సిక్స్‌ను సూపర్ హిట్ చేశామని చెప్పేందు తాము అనంతపురానికి వచ్చామన్నారు. సూపర్ సిక్స్ పథకాలను సూపర్ హిట్ చేశారని చెప్పడానికే ఈ విజయోత్సవ సభను నిర్వహిస్తున్నామన్నారు. సంక్షేమం అంటే ఓట్ల రాజకీయం కాదని.. బాధ్యతగా ప్రజలకు ఇచ్చిన హామీల అమలు అని అభివర్ణించారు. వైకాపా ఉనికి కోల్పోతోంది. పార్టీ ఆఫీసులు మూసుకొని.. సోషల్ మీడియా ఆఫీసులు తెరిచారు. ఎన్నికల సమయంలో సిద్ధం.. సిద్ధం అని ఎగిరిపడ్డారు. ప్రతిపక్ష హోదా ఇస్తేనే అసెంబ్లీకి వస్తానని అంటున్నారు. రాజకీయాల్లో ఓనమాలు తెలియని వ్యక్తి.. ప్రతిపక్ష హోదా అడుగుతున్నారు. ప్రతిపక్ష హోదా ఇచ్చేది నేను కాదు.. ప్రజలు. అసెంబ్లీకి రాని వ్యక్తులు రాజకీయాలకు అర్హులా? 57 శాతం మంది ప్రజలు ఓట్లేశారని.. 94 శాతం స్ట్రైక్ రేట్ వచ్చిందని.. 164 సీట్లు కూటమికి ఇచ్చి ప్రతిపక్షానికి హోదా కూడా లేకుండా చేశారని సీఎం చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. గత పాలకులు ప్రజా వేదికను కూల్చివేతతో విధ్వంసం మొదలు పెట్టి రాష్ట్రాన్ని అగాధంలోకి నెట్టిందన్నారు. అవినీతి అక్రమాలు, అప్పులు, తప్పుడు కేసులతో రాష్ట్రాన్ని విధ్వంసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చిన పెట్టుబడులను తరిమేసి.. రాష్ట్రానికి పరిశ్రమలు రాకుండా చేశారని మండిపడ్డారు. గత ప్రభుత్వం దాదాపు 93 పథకాలను నిలిపి వేసిందని గుర్తు చేశారు. పేద, మధ్య తరగతి జీవితాలను మార్చేందుకు సూపర్ సిక్స్ గా హామీ ఇచ్చాం. అధికారంలోకి రాగానే ఈ పథకాలను సూపర్ హిట్ చేశామన్నారు.



**పింఛన్ల పెంపు అంటే అసాధ్యమన్నారు కానీ**

సూపర్ సిక్స్ అంటే అవహేళన చేశారన్నారు. పెన్షన్ల, సూపర్ సిక్స్‌పై నాడు వాళ్లు ఏమన్నారో గుర్తుందా అంటూ ప్రజలను ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు ప్రశ్నించారు. సూపర్ సిక్స్ అంటే హేళన చేశారన్నారు. పింఛన్ల పెంపు అంటే అసాధ్యమని పేర్కొన్నారన్నారు. పిల్లలందరికీ తల్లికి వందనం అంటే ట్రోల్ చేశారని చెప్పారు. ఇంకా చెప్పాలంటే.. మెగా డీఎస్సీ అవ్వదన్నారు... దీపం వెలగదన్నారు... ఫ్రీ బస్సు కదలదన్నారంటూ గత వైసీపీలోని పెద్దలు చేసిన ప్రకటనలను ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు గుర్తు చేశారు. అయితే కూటమి ప్రభుత్వం అసాధ్యాన్ని సుసాధ్యం చేసిందని తెలిపారు. సూపర్ సిక్స్ సూపర్ హిట్ విజయోవత్సవ సభకు అశేషంగా వచ్చిన తరలి వచ్చిన మూడు పార్టీల శ్రేణులకు, ప్రజలకు, మహిళలకు ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు ధన్యవాదాలు తెలిపారు. నేపాల్ దేశంలో ఆందోళనలు జరుగుతున్నాయని.. అక్కడ మన తెలుగువాళ్లు 200 మంది చిక్కుకు పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. వారిని స్వస్థలాలకు తిరిగి తీసుకురావడానికి మంత్రి లోకేశ్‌కు బాధ్యతలు అప్పగించామని చెప్పారు. ఆయన రియల్ టైమ్ గవర్నెన్సులో ప్రతీ క్షణం సమీక్షిస్తూ చిక్కుకు పోయిన వారిని వెనక్కు రప్పించే ప్రయత్నంలో ఉన్నారని సీఎం చంద్రబాబు వివరించారు. యువ కిషోరాలను ఆదరిస్తామన్నారు. యువత అండగా ఉంటే కొండనైనా ఢీకొంటానని సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. 20 లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని సూపర్ సిక్స్‌లో చెప్పామన్నారు. మెగా డీఎస్సీ ద్వారా 16,347 ఉపాధ్యాయ పోస్టులు ఏడాదిలోనే భర్తీ చేశామని.. ఒక్క రూపాయి అవినీతి లేకుండా టీచర్ల రిక్రూట్‌మెంట్లు చేపట్టామని వివరించారు. నైపుణ్య శిక్షణ ద్వారా లక్ష మంది యువతకు ఉద్యోగాలు లభించేలా చర్యలు తీసుకున్నామన్నారు. గత ప్రభుత్వం రూ.10 లక్షల కోట్ల అప్పులు చేస్తే.... మనం రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చామని తెలిపారు. ఇదీ మన గుడ్ విల్, ఇదీ మన బ్రాండ్ అంటూ సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. యువత భవితకు భరోసా ఇచ్చాం కాబట్టే..'యువగళం' సూపర్ హిట్ అయిందన్నారు.

**ఎన్ని కష్టాలున్నా చేస్తాం..**

పేదవాడి ఆకలి తీర్చాలనే లక్ష్యంతో రాష్ట్ర వ్యాప్తంగా అన్నా క్యాంటీన్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీటి ద్వారా ఇప్పటి వరకు 5.60 కోట్ల భోజనాలతో ప్రజల కడుపు నింపామన్నారు. ఇంత కంటే ఆనందం ఏముందని ప్రశ్నించారు. గత ప్రభుత్వం పేదల పొట్ట కొట్టి.. అన్న క్యాంటీన్లను మూసేసిందని విమర్శించారు. ఆటో మిత్ర కింద ఆటో డ్రైవర్లకు రూ. 15 వేలు ఆర్థిక సాయం చేస్తామని ప్రకటించారు. ఎన్నికల్లో చెప్పాం... ఎన్ని కష్టాలున్నా చేస్తామని స్పష్టం చేశారు. ఇదీ పేదలపై కూటమి ప్రభుత్వానికి ఉన్న ప్రేమ అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. రైతు బాగుంటేనే సమాజం బాగుంటుందన్నారు. మనకు అన్నం పెట్టేది అన్నదాత అని ఈ సందర్భంగా గుర్తు చేశారు. రైతన్నకు అండగా ఉండేందుకే అన్నదాత సుఖీభవ పథకం తీసుకు వచ్చామని వివరించారు. కేంద్రంతో కలిసి ఏడాదికి మూడు విడతల్లో రూ. 20 వేలు ఇస్తామన్నారు. తొలి విడతగా ఇప్పటికే రూ.7 వేలు ఇచ్చామని చెప్పారు. 47 లక్షల మంది రైతులకు రూ.3,173 కోట్లు జమ చేశామన్నారు. నీళ్లిచ్చాం.. మైక్రో న్యూట్రియంట్స్ ఇచ్చాం.. మార్కెట్ గిట్టుబాటు ధర వచ్చేలా చేశామని వివరించారు.

## బాసరను అన్నివిధాల అభివృద్ధి చేస్తాం-మంత్రి జూపల్లి

- ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం
- 190 కోట్లతో ఆలయ మాస్టర్ ప్లాన్ అమలు
- గోదావరి పుష్కరాల కోసం ఇప్పటినుండే ప్రణాళికలు
- ఆలయాభివృద్ధి పై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ
- బాసర పర్యటనలో మంత్రి జూపల్లి హామీలు



**ఆదిలాబాద్ మహా :** బాసరను ప్రధాన పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతానని తెలంగాణ రాష్ట్ర ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. బుధవారం ఆయన నిర్మల్ జిల్లాలో పర్యటించారు. జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారిని దర్శించుకున్నారు. మంత్రికి ఆలయ అర్చకులు వేద మంత్రాల నడుమ పూర్ణకుంభంతో ఆహ్వానించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రిని ఆలయ అధికారులు శాలువాతో సత్కరించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. మంత్రి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆయన మహంకాళి అమ్మవారిని కూడా దర్శించుకున్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, అధికారులతో సమావేశం నిర్వహించి ఆలయ అభివృద్ధిపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో సుమారు రూ.190 కోట్ల వ్యయంతో బాసర ఆలయ మాస్టర్ ప్లాన్ అమలు చేయనున్నట్లు తెలిపారు. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖతో చర్చించి బాసర అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. బాసరను ప్రధాన పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని పేర్కొన్నారు. రానున్న గోదావరి పుష్కరాల కోసం ఇప్పటికే పకడ్బందీ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. పుష్కరాలను విజయవంతంగా నిర్వహించేలా అన్ని శాఖలతో సమన్వయం చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. బాసర ఆలయ అభివృద్ధిపై తాను ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నానని వివరించారు. అనంతరం బాసర మండలంలో ఇటీవల వర్షాలకు దెబ్బతిన్న పంటలను మంత్రి పరిశీలించారు. రైతులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. నష్టపోయిన రైతులను ఆదుకుంటామన్నారు. దెబ్బతిన్న పంటలను పూర్తిస్థాయిలో సర్వే చేసి ప్రభుత్వానికి అందజేయాలని అధికారులను ఆదేశించారు. రైతులకు నష్టపరిహారం కోసం తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. బాసరలో నూతన ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణానికి ఎంపీ గోడం నగేష్ తో కలిసి శంకుస్థాపన చేశారు. సుమారు రూ.5.75 కోట్ల వ్యయంతో 30 పడకల ఆసుపత్రిని నిర్మించనున్నట్టు మంత్రి తెలిపారు. ఆసుపత్రి పూర్తయితే బాసర ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దండె విఠల్ జిల్లా అధికారులు, మాజీ మంత్రి వేణుగోపాల చారి, మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి , మాజీ ఎమ్మెల్యేలు విఠల్ రెడ్డి , నారాయణ రావు పటేల్,రేఖానాయక్ తదితరులు పాల్గొన్నారు



## గాంధీ సరోవర్‌కు రక్షణ శాఖ భూములు బదలాయించండి

**రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు సీఎం రేవంత్ రెడ్డి వినతి**

(మొదటిపేజీ తరువాయి)

సమావేశమయ్యారు. మూసీ, ఈసా నదుల సంగమ స్థలిలో గాంధీ సరోవర్ ప్రాజెక్టు చేపట్టనున్నట్లు కేంద్ర మంత్రికి సీఎం వివరించారు. ఈ రెండు నదుల సంగమ స్థలిలో గాంధీ సర్కిల్ ఆఫ్ యూనిటీ నిర్మాణం చేపడతామని, ఇందుకు అక్కడ ఉన్న 98.20 ఎకరాల రక్షణ శాఖ భూములు రాష్ట్ర ప్రభుత్వానికి బదలాయించాలని రక్షణ శాఖ మంత్రిని సీఎం కోరారు. జాతీయ సమైక్యత, గాంధేయ విలువలకు సంకేతంగా గాంధీ సరోవర్ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టనున్నట్లు కేంద్ర మంత్రికి ముఖ్యమంత్రి తెలిపారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టులో గాంధీ సిద్ధాంతాలను ప్రచారం చేసే నాలెడ్జ్ హబ్, ధ్యాన గ్రామం, చేనేత ప్రచార కేంద్రం, ప్రజా వినోద స్థలాలు ,ల్యాండ్ స్కేప్, ఘాట్లు, శాంతి విగ్రహం మ్యూజియం నిర్మిస్తామని కేంద్ర మంత్రికి సీఎం వివరించారు. సమావేశంలో ఎంపీలు పోరిక బలరాం నాయక్, కడియం కావ్య, చామల కిరణ్ కుమార్ రెడ్డి, మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఇ.వి. నరసింహారెడ్డి, కేంద్ర ప్రాజెక్టులు, పథకాల సమన్వయకర్త డాక్టర్ గౌరవ్ ఉప్పల్ పాల్గొన్నారు

## ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయను

- ఏం చేసుకుంటారో చేసుకోండి
- గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్
- పార్టీ తప్పు చేస్తే ఎదురుతిరుగుతా



**హైదరాబాద్, మాహా :** గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ మరోమారు సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను ఎమ్మెల్యే పదవికి ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీనామా చేయబోనని స్పష్టం చేశారు. ఈ విషయంలో ఎవరేమి చేసుకుంటారో చేసుకోండంటూ తీవ్రంగా స్పందించారు. తన రాజకీయ వైఖరిపై వస్తున్న ఊహాగానాలకు తెరదించుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. తనను వరుసగా మూడుసార్లు గోషామహల్ నియోజకవర్గ ప్రజలే గెలిపించారన్నారు. రాష్ట్ర స్థాయి బీజేపీ తనకు ఏ విధమైన మద్దతు ఇవ్వలేదని విమర్శించారు. ఎమ్మెల్యే పదవికి తాను రాజీనామా ఇచ్చే అవకాశమే లేదని తేల్చి చెప్పారు. తాను చెప్పిన మాటల్లో ఏమైనా తప్పు ఉందా అంటే బీజేపీ కార్యకర్తలను అడిగి తెలుసుకోవచ్చునన్నారు. కొంతమంది పార్టీ పెద్దలకు భయపడి ఏమీ అనలేకపోతుండవచ్చునని రాజాసింగ్ అన్నారు. వారికి పదవి భయం ఉండవచ్చునని, కానీ తనకు ఎలాంటి పదవి ఆశ లేదని స్పష్టం చేశారు. తాను చేసే ప్రతి వ్యాఖ్య కార్యకర్తలకు మద్దతుగా ఉంటుందన్నారు. తన వైఖరి భిన్నంగా ఉంటుందని రాజాసింగ్ స్పష్టం చేశారు. పార్టీ పెద్దలు ఎప్పుడు తప్పు చేసినా, తాను కచ్చితంగా ఎదురు తిరిగి ప్రశ్నిస్తానని ఆయన వెల్లడించారు. పార్టీ ప్రయోజనాల కంటే ప్రజల శ్రేయస్సే తనకు ముఖ్యమని, అందుకోసం ఎవరితోనైనా పోరాడతానని ఆయన పేర్కొన్నారు. తనకు ఢిల్లీ పెద్దలు తరుచూ ఫోన్ చేసి మాట్లాడుతారని, తనకు అధిష్ఠానం పెద్దల ఆశీర్వాదం ఉందని ఆయన అన్నారు. వాళ్లను కలిసి పార్టీలో జరిగిందంతా చెబుతానని వ్యాఖ్యానించారు. తాను ఎప్పటికీ బీజేపీ నేతనేనని, కానీ సెక్యులర్ వాదిని మాత్రం కానని స్పష్టం చేశారు. తాను బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలలో చేరేది లేదని తేల్చి చెప్పారు. పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసినందుకు యోగి ఆదిత్యనాథ్ తనకు ఫోన్ చేసి తిట్టారని అన్నారు. తాను చేసే కామెంట్స్ పార్టీపై కాదని, కొందరు నేతలపై మాత్రమే అన్నారు.

## బీరు, బిర్యానీ అలవాటు చేసిందే కేటీఆర్

**పొన్నం ప్రభాకర్ సంచలన వ్యాఖ్యలు**

**హైదరాబాద్, మహా:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై మంత్రి పొన్నం ప్రభాకర్ హాట్ కామెంట్స్ చేశారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. హైడ్రాపై, ఇళ్ల కూల్చివేతపై కేటీఆర్ మాట్లాడుతుంటే నవ్వొస్తోందని ఎద్దేవా చేశారు. ఎన్నికలు రాగానే ప్రజలను బీరు, బిర్యానీలకు అలవాటు చేసిందే కేటీఆర్ అని మండిపడ్డారు. మాగంటి గోపీనాథ్‌పై అంత ప్రేమ ఉంటే మంత్రి పదవి ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. ఎన్నికలు వస్తేనే కేటీఆర్ వస్తారు.. జూబ్లీహిల్స్ ఎన్నికల్లోనూ ప్రజలు బీఆర్ఎస్‌కు బుద్ధి చెప్పడం ఖాయమని అన్నారు.

## భారత విద్యార్థులకు కెనడా భారీ షాక్!

**భారతీయ విద్యార్థులకు వీసా జారీలో కెనడా గ్రాఫ్ డౌన్**

**వీసా దరఖాస్తుల్లో 80 శాతం వరకు తిరస్కరణ.. జర్మనీకి ఆదరణ**

**ఇంటర్నెట్ డెస్క్, మహా:** భారతీయ విద్యార్థుల వీసాల తిరస్కరణ గణనీయంగా పెరగడంతో కెనడాలో కొత్తగా ప్రవేశాలు పొందుతున్న వారి సంఖ్య కూడా భారీగా తగ్గింది. 2024లో కేవలం 1.88 లక్షల మంది భారతీయ విద్యార్థులకు మాత్రమే కెనడాలో ప్రవేశాలు లభించాయి. రెండేళ్ల క్రితంతో పోలిస్తే ఈ సంఖ్య సగానికి పైగా పడిపోవడం గమనార్హం. ఒకప్పుడు 18 శాతం మంది విద్యార్థులు కెనడాను ఎంచుకుంటే ఇప్పుడు ఆ సంఖ్య 9 శాతానికి పడిపోయింది. దేశంలో గృహాల కొరత, మౌలిక వసతులపై ఒత్తిడి, స్థానిక రాజకీయ కారణాల వల్ల కెనడా ప్రభుత్వం ఈ కఠిన నిర్ణయాలు తీసుకుంటోంది.

**వర్క్ పర్మిట్ నిబంధనలను కఠినతరం..**

వీసా కోసం విద్యార్థులు ఇప్పుడు మరింత పటిష్ఠమైన ఆర్థిక పత్రాలు, స్పష్టమైన స్టడీ ప్లాన్‌లు, లాంగ్వేజ్ టెస్ట్ ఫలితాలు సమర్పించాల్సి వస్తోంది. కనీస ఆర్థిక అవసరం రెట్టింపై 20,000 కెనడియన్ డాలర్లకన్నా ఎక్కువైంది. అంతేకాకుండా, చదువు తర్వాత ఉద్యోగ అవకాశాలను తగ్గించడం, కొన్ని వర్క్ పర్మిట్ నిబంధనలను కఠినతరం చేయడం వంటి చర్యలు చేపట్టింది. వేగవంతమైన వీసా ప్రక్రియ కోసం ఉద్దేశించిన 'స్టూడెంట్ డైరెక్ట్ స్ట్రీమ్'ను కూడా నిలిపివేసింది.

**జర్మనీ వైపు విద్యార్థుల చూపు..**

కెనడా తలుపులు మూస్తుండటంతో భారత విద్యార్థులు ప్రత్యామ్నాయ మార్గాల వైపు చూస్తున్నారు. ఈ క్రమంలో వారికి కొత్త గమ్యస్థానంగా జర్మనీ మారింది. అప్‌గ్రాడ్ నివేదిక ప్రకారం 31 శాతం మంది భారత విద్యార్థులు ఇప్పుడు జర్మనీలో చదివేందుకు ఆసక్తి చూపుతున్నారు. జర్మనీలో నామమాత్రపు ఫీజులు లేదా ఉచిత విద్య, ఇంగ్లిష్‌లో బోధించే కోర్సుల సంఖ్య పెరగడం, బలమైన ఆర్థిక వ్యవస్థ, మెరుగైన ఉపాధి అవకాశాలు వంటివి విద్యార్థులను ఆకర్షిస్తున్నాయి. గత ఐదేళ్లలో జర్మనీలో భారత విద్యార్థుల సంఖ్య రెట్టింపై దాదాపు 60,000కు చేరినట్లు గణాంకాలు పేర్కొంటున్నాయి.

## జూబ్లీహిల్స్ బరిలో మాగంటి సునిత

**సన్నాహక సమావేశంలో కేటీఆర్ స్పష్టత**

- జూబ్లీహిల్స్ నుండే గులాబీ జైత్రయాత్ర
- గోపినాథ్ కుటుంబానికి అండగా నిలవాలని పిలుపు
- ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఇన్ ఛార్జి బాధ్యతలు



(మొదటిపేజీ తరువాయి)

ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో భాగంగా బీఆర్ఎస్ అభ్యర్థిగా మాగంటి సునీతను ప్రకటిస్తున్నామని తెలిపారు. ఆమెకు అందరి ఆశీస్సులు ఉంటాయని భావిస్తున్నాను. జూబ్లీహిల్స్ బైఎలక్షన్‌లో మాగంటి సునీతను భారీ మెజార్టీతో గెలిపించడమే గోపీనాథ్‌కు ఇచ్చే సరైన నివాళి అన్నారు. ఈ ఉప ఎన్నికలో ఒక్కో ఓటుకు రూ.5 వేలు పంచితే తామే గెలుస్తామని కాంగ్రెస్ నేతలు భావిస్తున్నారంటూ కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో ఒక్క దాన్ని కూడా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయలేదని ఆయన ఆరోపించారు. అలానే కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన హైడ్రా పెద్దల జోలికి వెళ్లదని.. అందుకే సీఎం సోదరుడు చెరువుని ఆక్రమించి ఇల్లు నిర్మించినా పట్టించుకోలేదని.. కానీ పేదల బస్తీలకు వెళ్లి.. వారి ఇళ్లు కూలగొడుతుందని కేటీఆర్ విమర్శించారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక నేపథ్యంలో సర్వేలు నిర్వహించామని.. నియోజకవర్గంలో పార్టీ పరిస్థితి చాలా బాగుందని తెలుస్తోందని కేటీఆర్ అన్నారు. కొన్ని బస్తీల్లో వెనకబడి ఉన్నామని, అందరం కలిసి కట్టుగా పని చేస్తే పార్టీ గెలుస్తుందని తెలిపారు. కార్యకర్తలు, నాయకులంతా కలిసికట్టుగా పని చేసి పార్టీ గెలుపు కోసం శ్రమించాలన్నారు. అలానే ఓటర్ల జాబితాలో దొంగ ఓట్లను తొలగించి.. లేని వారి పేర్లు చేర్చాలన్నారు. కేసీఆర్ మళ్లీ సీఎం కావాలంటే జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో సత్తా చాటాలని కేటీఆర్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. జూబ్లీహిల్స్ నుంచే బీఆర్ఎస్ జైత్రయాత్ర మొదలవ్వాలని కేటీఆర్ ఆశాభావం వ్యక్తం చేశారు. మాగంటి సునీత మాట్లాడుతూ, తన భర్త మాగంటి గోపీనాథ్‌లాగే తనకు కూడా కార్యకర్తలు అండగా నిలవాలని కోరారు. గోపీనాథ్ ఆశయాలను నెరవేర్చేందుకు అందరం కలిసికట్టుగా పని చేద్దామని ఆమె పిలుపునిచ్చారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో బీఆర్ఎస్‌ను భారీ మెజార్టీతో గెలిపిస్తామని ఆమె ధీమా వ్యక్తం చేశారు. పార్టీ సీనియర్ నేత పి. విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ పార్టీలో కష్టపడే కార్యకర్తలకు గుర్తింపు ఉందన్నారు. ఉప ఎన్నికల్లో పార్టీని భారీ మెజార్టీతో గెలిపిద్దామని ఆయన పిలుపునిచ్చారు.

## నేపాల్‌లో చిక్కుకున్న తెలంగాణ వాసుల కోసం ఢిల్లీలో హెల్ప్ లైన్

**ముగ్గురు అధికారుల బృందానికి బాధ్యతల అప్పగింత**

**ఢిల్లీ, మహా:** నేపాల్‌లో చోటుచేసుకున్న హింసాత్మక ఘటనల నేపథ్యంలో పలువురు తెలంగాణవాసులు అక్కడ చిక్కుకుపోవడంతో, వారికి సహాయం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ఈ సహాయ కేంద్రం బాధ్యతలను ముగ్గురు అధికారుల బృందానికి అప్పగించింది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం నేపాల్‌లో తెలంగాణ పౌరులెవరికీ ఎలాంటి ఇబ్బందులు లేవని ప్రభుత్వం తెలిపింది. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, ఖాట్మండ్‌లోని భారత రాయబార కార్యాలయంతో రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం సమన్వయం చేసుకుంటూ ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటోంది. నేపాల్‌లో చిక్కుకుపోయిన తెలంగాణ పౌరులు, వారి కుటుంబ సభ్యులు అధికారిక సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలని, తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని ప్రభుత్వం స్పష్టం చేసింది. నేపాల్‌లో ఎవరైనా తెలంగాణ వాసులు చిక్కుకుంటే వారి కుటుంబ సభ్యులు ఢిల్లీలోని తెలంగాణ భవన్ అధికారులను ఈ కింది నెంబర్ల ద్వారా సంప్రదించవచ్చు. వందన, రెసిడెంట్ కమిషనర్, ప్రైవేట్ సెక్రటరీ అండ్ లైజన్ హెడ్ +91 9871999044, రక్షిత్ నాయక్, లైజన్ ఆఫీసర్ +91 9643723157, హెచ్ చక్రవర్తి, ప్రజా సంబంధాల అధికారి +91 9949351270

## ఫ్రాన్స్‌ను కుదిపేస్తోన్న ఆందోళనలు

**బ్లాక్ ఎవ్విరిథింగ్ ఉద్యమం.. కొత్త ప్రధాని ఎంపిక కాగానే నిరసనలు**



**మహా:** ఐరోపా దేశం ఫ్రాన్స్‌ను ఆందోళనలు కుదిపేస్తున్నాయి. రాజధాని పారిస్ సహా ఫ్రాన్స్‌లోని ఇతర ప్రాంతాల్లో బుధవారం నిరసనకారులు రహదారులపై బైఠాయించి, వాహనాలకు నిప్పటించారు. దీంతో వారిని చెదరగొట్టడానికి పోలీసుల టియర్ గ్యాస్ ప్రయోగించాల్సి వచ్చింది. అధ్యక్షుడు ఇమ్మాన్యుయెల్ మెక్రాన్ పాలనకు వ్యతిరేకంగా మరోసారి ఫ్రాన్స్‌లో ఉద్యమం మొదలైంది. 'అన్నీ ఆపేయాలి ( బ్లాక్ ఎవ్విరిథింగ్ )' పేరుతో దేశవ్యాప్తంగా ఈ ఆందోళనలకు పిలునిచ్చారు. దీంతో కొద్ది గంటల్లో దాదాపు 200 మందిని అరెస్టు చేసినట్టు అంతర్గత వ్యవహారాల మంత్రి ప్రకటించారు. ఆందోళనలను అడ్డుకోడానికి దాదాపు, 80,000 మంది పోలీసులను మెక్రాన్ ప్రభుత్వం ప్రత్యేకంగా మోహరించింది. అయినాసరే నిరసనకారులు వెనక్కి తగ్గలేదు. సోమవారం ఫ్రాన్స్ పార్లమెంట్‌లో ప్రధాన మంత్రి ఫ్రాంకోయిస్ బేరోకు వ్యతిరేకంగా ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో ఆయన తప్పుకున్నారు. దీంతో కొత్త ప్రధానిగా సెబాస్టియన్ లెక్రోను అధ్యక్షుడు మెక్రాన్ మంగళవారం నియమించారు. దీనిని వ్యతిరేకిస్తూ ఆకస్మిక ఆందోళనలకు నిరసకారులు పిలుపునిచ్చారు. స్పష్టమైన నాయకత్వం లేకుండానే వైరల్‌గా వ్యాప్తి చెందిన ఈ ఉద్యమం వెనుక విస్తృతమైన డిమాండ్లు ఉన్నాయి.

## ఎవరు ఆపినా కేటీఆర్ అరెస్ట్ ఆగదు!

- దోచుకున్న దోపిడీ సొమ్మునంతా కక్కిస్తాం
- రాజకీయ కక్ష సాధింపు చర్యలు లేవు.. చట్ట ప్రకారమే వెళ్తాం
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి హాట్ కామెంట్స్

**నల్గొండ, మహా:** కాళేశ్వరం ప్రాజెక్టు, ఈ కారు రేస్, ధరణిలో దోచుకున్న సొమ్మునంతా కక్కిస్తాం.. పేదలకు అందిస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన నల్గొండలో బుధవారం మీడియాతో మాట్లాడారు. పక్క రాష్ట్రంలో మాజీ మంత్రులు ఎంపీ, ఎమ్మెల్యేలు అరెస్ట్ అవుతున్నారని తెలిపారు. ఇక్కడ అరెస్టులు లేవని పేర్కొన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని పూర్తిగా ఖూనీ చేస్తుందని ఆరోపించారు. రాజకీయ కక్ష సాధింపు చర్యలకు తాము పాల్పడమని, చట్ట ప్రకారమే అన్ని జరుగుతాయని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. కమిటీల ప్రకారమే నిర్ణయాలు ఉంటాయని, ఒక్కో కమిటీ రిపోర్ట్ వచ్చాక దోషులపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఎఫ్ 1 రేసులో క్యాబినెట్ తీర్మానం లేకుండా విదేశీ కంపెనీలకు ఇవ్వడం.. ఎలక్టోరల్ బాండ్లు బీఆర్ఎస్ పార్టీకి వచ్చినట్టు ఆధారాలు ఉన్నప్పుడు ఎవరు ఆపినా వారి అరెస్టులు ఆగవని ఆయన స్పష్టం చేశారు.

ANN తెలుగు
మహా పత్రిక
గురువారం, హైదరాబాద్ | 11-09-2025
జనరల్ వార్తలు | GENERAL NEWS
WWW.MAHAADAILY.COM


## జాతీయ లోక్ అదాలత్ సద్వినియోగం చేసుకోవాలి


**జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే**



**భూపాలపల్లి, మహా:** సెప్టెంబర్ 13 న జరగనున్న జాతీయ లోక్అదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలని భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే ఒక ప్రకటనలో తెలిపారు. రాజీ మార్గమే.. రాజ మార్గం! రాజీపడడానికి అవకాశం ఉన్న అన్ని కేసులలో కక్షిదారులు రాజీ పడవచ్చు నని జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే తెలిపారు. క్షణికావేశంలో చేసే తప్పులను సరిదిద్దుకోవాడానికి లోక్అదాలత్ అనేది ఒక మంచి అవకాశం అని, అనవసర గొడవలకు పోయి జీవితాలను ఇబ్బందులపాలు చేసుకోకూడదని అన్నారు. జిల్లా వ్యాప్తంగా నమోదైన, చాలా కాలంగా పెండింగ్ లో ఉన్న, రాజీ కుదుర్చుకోవడానికి అవకాశం ఉన్న అన్ని కేసులలో కక్షిదారులు రాజీపడేలా జాతీయ లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. రాజీ పడదగిన కేసులు: క్రిమినల్ కంపౌండబుల్ కేసులు,సివిల్ తగాదా కేసులు, ఆస్తి విభజన కేసులు, కుటుంబపరమైన కేసులు, వైవాహిక జీవితం సంబంధిత కేసులు,బ్యాంకు రికవరీ,విద్యుత్ చౌర్యం,చెక్ బౌన్స్ కేసులుకేసుల్లో ఇరువర్గాల మధ్య రాజీకి అవకాశం ఉంటుంది అన్నారు. కానిస్టేబుల్ నుండి అధికారుల వరకు ప్రతి ఒక్కరు భాధ్యతగా వ్యవహరించి, రాజీ పడదగిన కేసులలో ఇరువర్గాలకు కౌన్సిలింగ్ నిర్వహించి, వీలైనన్ని ఎక్కువ కేసులు రాజీ పడేలా చూడాలన్నారు. జాతీయ లోక్అదాలత్ ద్వారా సత్వర పరిష్కారం జరుగుతుందని అవగాహన కల్పించాలని అన్నారు.

## 9 లక్షల మంది రైతులకు రిలీఫ్

- సాదా బైనామాల దరఖాస్తుల పరిష్కారానికి నోటిఫికేషన్
- భూ భారతి ప్రకారం క్రమబద్ధీకరణకు రెవెన్యూ శాఖ చర్యలు




**హైదరాబాద్, మహా:** సాదాబైనామా క్రమబద్ధీకరణకు ఎట్టకేలకు మార్గం సుగమమైంది. సాదాబైనామాల దరఖాస్తుల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం బుధవారం నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో సుమారు 9 లక్షల మంది రైతులకు ఊరట లభించనుంది. భూ భారతి చట్టం ప్రకారం క్రమబద్ధీకరణకు రెవెన్యూ శాఖ చర్యలు ప్రారంభించింది. 2020 ఆర్వోఆర్ చట్టంలో క్రమబద్ధీకరణకు సెక్షన్లు లేకపోవడంతో అప్పట్లో ఈ ప్రక్రియను న్యాయస్థానం నిలిపివేసింది. సాదాబైనామాల క్రమబద్ధీకరణ చేపడతామంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పలుమార్లు ప్రకటించారు. న్యాయస్థానంలో ఉన్న వివాద పరిష్కారానికి పలు చర్యలు చేపట్టారు. దీంతో తాజాగా హైకోర్టు సాదాబైనామా రైతులకు 13బీ ప్రొసీడింగ్స్ జారీ చేయడానికి అనుమతించిన విషయం తెలిసిందే.

**9,00,894 దరఖాస్తులు పెండింగులో..**

రాష్ట్రంలోని పట్టణాలు మినహా ఇతర ప్రాంతాల్లో 2014 జూన్ రెండో తేదీ ముందు వరకున్న సాదా బైనామా కొనుగోళ్లను.. 2016లో నాటి ప్రభుత్వం తొలిసారి క్రమబద్ధీకరించింది. అప్పట్లో 12.64 లక్షల దరఖాస్తులు రాగా.. పరిశీలన అనంతరం 6.18 లక్షల మేర క్రమబద్ధీకరించారు. రెండోసారి 2020లో క్రమబద్ధీకరణకు అవకాశమిస్తూ ప్రభుత్వం దరఖాస్తులను ఆహ్వానించింది. కానీ ఆర్వోఆర్ 1971ను సవరించి తెచ్చిన ఆర్వోఆర్2020 చట్టంలో క్రమబద్ధీకరణకు సెక్షన్లు చేర్చలేదు. పైగా 2020 చట్టం అమలులోకి రావడానికి ముందు, ఆ తర్వాత దరఖాస్తులను స్వీకరించడం న్యాయ వివాదానికి దారితీసింది. 1971 నాటి చట్టం అమల్లో ఉన్నప్పుడు తీసుకున్న దరఖాస్తులనే పరిగణలోకి తీసుకోవాలని కోర్టు ఆదేశాలిచ్చింది. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకురావాలనుకున్నా ఈ ప్రక్రియ మొత్తం నిలిచిపోయింది. అప్పుడు వచ్చిన 9,00,894 దరఖాస్తులు పెండింగులో ఉన్నాయి.

## మన రాజ్యాంగం చూసి గర్విస్తున్నాం

**నేపాల్ లాంటి పొరుగు దేశాల్లో ఏం జరుగుతుందో చూడండి**

**ఓ కేసు విచారణ సమయంలో సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు**



**ఢిల్లీ, మహా:** నేపాల్‌లో యువత నిరసనలు హింసాత్మకంగా మారాయి. దీంతో అక్కడ రాజకీయ సంక్షోభం ఏర్పడింది. కొన్ని నెలల క్రితం బంగ్లాదేశ్‌లోనూ ఇదే పరిస్థితి. ప్రధాని పదవికి రాజీనామా చేసిన షేక్ హసీనా.. దేశాన్ని వీడి భారత్‌లో తలదాచుకుంటున్నారు. ఈ పరిణామాల నడుమ ఓ కేసు విచారణ సమయంలో సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. నేపాల్, బంగ్లాదేశ్‌లోని పరిస్థితులను ఉటంకిస్తూ.. మన రాజ్యాంగం పట్ల గర్వపడుతున్నట్లు పేర్కొంది. రాష్ట్రాల బిల్లుల ఆమోదంలో న్యాయస్థానం తనకు గడువు నిర్దేశించడంపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము కోరిన అభిప్రాయం అంశమై సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ముందు బుధవారం వాదనలు కొనసాగాయి.

**సలహా కోరే హక్కు రాష్ట్రపతికి ఉంది..**

సీజేఐ జస్టిస్ బి.ఆర్.గవాయ్ నేతృత్వంలోని ఈ ధర్మాసనంలో జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ పి.ఎస్.నరసింహ, జస్టిస్ ఎ.ఎస్.చందూర్కర్ సభ్యులుగా ఉన్నారు. ఈక్రమంలోనే రాజ్యాంగాన్ని ప్రస్తావించిన సీజేఐ జస్టిస్ బి.ఆర్.గవాయ్.. ప్రజా ప్రాముఖ్యం కలిగిన లేదా ప్రజలను ప్రభావితం చేసే ఏదైనా చట్టంపై సుప్రీంకోర్టు సలహా కోరే హక్కు రాష్ట్రపతికి ఉందన్నారు. ''మన రాజ్యాంగం చూసి గర్విస్తున్నాం. పొరుగుదేశాల్లో ఏం జరుగుతుందో చూడండి. నేపాల్‌లో పరిస్థితి గమనించండి'' అని వ్యాఖ్యానించారు. ''అవును.. బంగ్లాదేశ్‌లోనూ'' అంటూ జస్టిస్ విక్రమ్‌నాథ్ స్పందించారు.

## గ్రూప్ 1పై కీలక నిర్ణయం

**హైకోర్టు తీర్పును సవాల్ చేయనున్న టీజీపీఎస్సీ**

**హైదరాబాద్, మహా :** గ్రూప్ 1 మెయిన్స్ పై తెలంగాణ హైకోర్టు సంచలన తీర్పు ఇచ్చిన సంగతి తెలిసిందే. గ్రూప్ 1 మెయిన్స్ మెరిట్ లిస్ట్‌ను రద్దు చేస్తూ జస్టిస్ నామావరపు రాజేశ్వరరావు ధర్మాసనం కీలక ఆదేశాలు జారీ చేసింది. అయితే, ఈ విషయంపై హైకోర్టు తీర్పును తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సవాల్ చేయాలని నిర్ణయించింది. బుధవారం మధ్యాహ్నం కమిషన్ కీలక సమావేశమై న్యాయపరమైన అంశాలు చర్చించాక తుది నిర్ణయం తీసుకోనుందని వార్తలు వినిపిస్తున్నాయి. అవసరమైతే సుప్రీంకోర్టుకు కూడా వెళ్ళాలని టీజీపీఎస్ సీ కార్యాలయంలో న్యాయనిపుణులతో చర్చించి అభిప్రాయం తీసుకున్న తర్వాత బోర్డు నిర్ణయానికి వచ్చింది. ఇదిలా ఉండగా, ఏప్రిల్ నెలలో టీజీపీఎస్సీ గ్రూప్1 మెయిన్స్ ఫలితాలను ప్రకటించింది. మూల్యాంకనలో అవకతవకలు జరిగాయని కొంతమంది అభ్యర్థులు ఆరోపిస్తూ హైకోర్టును ఆశ్రయించారు. ఈ విషయంపై విచారించిన న్యాయస్థానం అభ్యర్థుల వాదనలతో ఏకీభవించి మెయిన్స్ మెరిట్ లిస్ట్‌ను రద్దు చేయాలని సంచలన తీర్పు వెల్లడించింది. పేపర్లు రీ వాల్యుయేషన్ చేయాలని కుదరకపోతే మెయిన్స్ మరోసారి నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలోనే టీజీపీఎస్సీ హైకోర్టు తీర్పును సవాల్ చేయనుంది. న్యాయనిపుణులతో చర్చించిన అనంతరం వారిచ్చిన అభిప్రాయాలను రాష్ట్ర ప్రభుత్వానికి అందించి తిరిగి టీజీపీఎస్ సీ హైకోర్టులో సవాల్ చేయనుంది.

## నిజమైన జర్నలిస్టులకు మేలు జరగాలి

**హైదరాబాద్:** నిజమైన జర్నలిస్టులకు మేలు జరిగేలా నిర్ణయాలు ఉండాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులకు సూచించారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలో ప్రెస్ అకాడమీ ఛైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి, ఐ&పిఆర్ స్పెషల్ కమీషనర్ సిహెచ్. ప్రియాంక, సీపీఆర్వో జి. మల్సూర్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రధానంగా అక్రిడిటేషన్ పాలసీ, జర్నలిస్టుల హెల్త్ పాలసీ, జర్నలిస్టుల అవార్డులు, జర్నలిస్టులపై దాడులకు సంబంధించి హైపవర్ కమిటీ తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ అంశాలపై కార్మిక, ఆరోగ్య, హోం, ఆర్థిక శాఖ అధికారులతో త్వరలో మరోసారి సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు.

## మరో మూడు రోజులు భారీ వర్షాలు

- ఉపరితల ఆవర్తనం ప్రభావంతో రాష్ట్రానికి వర్ష సూచన
- పలు జిల్లాలకు హెచ్చరికలు.. బుధవారం పలు ప్రాంతాల్లో దంచికొట్టిన వాన

**హైదరాబాద్, మహా:** ఉపరితల ఆవర్తనం ప్రభావంతో తెలంగాణలోని పలు జిల్లాల్లో ఈ నెల 14 వరకు భారీ వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. గురువారం, శుక్రవారం ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాల్లో.. వచ్చే మూడు ోజుల పాటు హైదరాబాద్‌లో వర్షాలు కురిసే అవకాశముందని అధికారులు పేర్కొన్నారు. బుధవారం దిలాబాద్, కుమురంభీం, నిర్మల్, నిజామాబాద్, సిరిసిల్ల, భూపాలపల్లి, మహబూబాబాద్, సిద్దిపేట, మెదక్, కామారెడ్డి, జిల్లాల్లో పలు చోట్ల.. గురువారం కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల్లో వర్షాలు పడే అవకాశముందన్నారు. దీంతో పలు జిల్లాలకు వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేసింది. జోగులాంబ జిల్లాలో సాయంత్రం పిడుగుపాటుకు ముగ్గురు కూలీలు మృతి చెందారు.

### పలు ప్రాంతాల్లో వర్షం

బుధవారం సాయంత్రం సికింద్రాబాద్, బోయిన్‌పల్లి, తిరుమలగిరి, అల్వాల్, బొల్లారం, ప్యాట్నీ, ప్యారడైజ్, మారేడుపల్లి తదితర ప్రాంతంలో వర్షం కురిసింది. ఉదయం నుంచి ఉక్కపోత వాతావరణంతో ఇబ్బందులు ఎదుర్కొన్న నగరవాసులు ఒక్కసారిగా కురిసిన వర్షంతో ఉపశమనం పొందారు. భారీ వర్షంతో రహదారులపై నీరు చేరి వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

## ఏం చేద్దాం?

- క్లైమాక్స్ కు ఫార్ములా ఈ కారు రేసు కేసు
- కేటీఆర్ తో హరీశ్ రావు భేటీ
- క్విడ్ ప్రోకో జరిగిందని తేల్చిన ఏసీబీ అధికారులు
- కేసు విషయంలో ఎలా ముందుకు వెళ్లాలనే దానిపై డిస్కషన్

**హైదరాబాద్, మహా:** బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆ పార్టీ సీనియర్ నేత హరీష్ రావు నివాసానికి చేరుకున్నారు. ఫార్ములా ఈ కారు రేస్ కేసు నేపథ్యంలో ఇరువురు నేతలు భేటీ అయ్యారు. ప్రభుత్వం దూకుడుగా ముందుకు వెళితే ఏం చేయాలనే దానిపై చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. అయితే, ఫార్ములా ఈ రేసు కేసు లొట్టపీసు కేసు అంటోన్న కేటీఆర్.. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెంచేందుకే కారు రేస్‌కు తానే చొరవ తీసుకున్నానన్నారు. ఒక్క రూపాయి కూడా ఇందులో అవినీతి జరగలేదని కేటీఆర్ స్పష్టం చేశారు. మాజీ మంత్రి కేటీఆర్ నిందితుడిగా ఉన్న ఫార్ములాఈ కారు రేసులో క్విడ్ ప్రోకో జరిగిందని ఏసీబీ అధికారులు గుర్తించినట్లు సమాచారం. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో హెచ్ఎండీఏ ఖాతా నుంచి రూ.45 కోట్ల మేర నిధులు ఫార్ములా ఈ కారు రేస్‌లో భాగస్వాములైన కంపెనీకి బదిలీ చేయడం.. ఆ కంపెనీల నుంచి ఎలక్టోరల్ బాండ్ల రూపంలో తిరిగి రూ. 44 కోట్ల నిధులు బీఆర్ఎస్‌కు రావడం స్పష్టంగా కనిపిస్తోందని ఏసీబీ అంచనాకు వచ్చింది. ఈ కేసులో ఏ1గా మాజీ మంత్రి కేటీఆర్ ఉండటం సంచలనంగా మారింది. ఈ నేపథ్యంలోనే ఈ కేసు విషయంలో ఎలా ముందుకు వెళ్లాలి అని హరీష్ రావుతో కేటీఆర్ భేటీ అయినట్లు తెలుస్తోంది.

## చంద్రబాబు దేంట్లోనైనా దూకి చావాలి

**అర్ధరాత్రి మా నేతలకు పోలీసులు నోటీసులు ఇచ్చి భయపెడతారా?**

**కుప్పంలో కూడా రైతులు ఎరువుల కోసం బారులు తీరడం సిగ్గుచేటు**

**ఏపీ సీఎం చంద్రబాబుపై జగన్ సంచలన వ్యాఖ్యలు**



**తాడేపల్లి, మహా:** ఏపీ మాజీ సీఎం జగన్, ఏపీ సీఎం చంద్రబాబుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సొంత నియోజకవర్గమైన కుప్పంలో కూడా రైతులు ఎరువుల కోసం బారులు తీరడం సిగ్గుచేటని, ఈ అవమానం భరించలేక ఆయన దేంట్లోనైనా దూకి చావొచ్చు అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో అసలు ప్రభుత్వం ఉందా? అనే సందేహం కలుగుతోందని విమర్శించారు. ప్రభుత్వం కావాలనే ఎరువుల కృత్రిమ కొరత సృష్టించి, బ్లాక్ మార్కెట్‌ను ప్రోత్సహిస్తోందని జగన్ ఆరోపించారు. తమ ఐదేళ్ల పాలనలో ఎరువుల కోసం రైతులు రోడ్డెక్కిన పరిస్థితి ఎన్నడూ లేదని గుర్తు చేశారు.

**రైతుల కోసం పోరాడటం తప్పా?..**

"గత రెండు నెలలుగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వారి సమస్యలపై పోరాడేందుకు మా పార్టీ ఆధ్వర్యంలో 'అన్నదాత పోరు' కార్యక్రమం నిర్వహించి ఆర్డీవోలకు వినతి పత్రాలు ఇస్తే, అర్ధరాత్రి పోలీసులు వచ్చి మా నేతలకు నోటీసులు ఇచ్చి భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. రైతుల కోసం పోరాడటం తప్పా?" అని జగన్ ప్రభుత్వాన్ని నిలదీశారు. రాష్ట్రంలో పాలన ప్రజల కోసం కాకుండా దోపిడీదారుల కోసం సాగుతోందని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలను పబ్లిక్‌ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీపీపీ) విధానంలో ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలను ప్రైవేటు వ్యక్తుల దోపిడీకి అప్పగించేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ దేశంతో పోలిస్తే తిరోగమనంలో ఉందని, 'రెడ్ బుక్' పాలనలో ప్రజలు తమ గొంతు విప్పే స్వేచ్ఛ కూడా కోల్పోయారని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. కనీస బాధ్యతలను కూడా ప్రభుత్వం విస్మరించిందని ఆయన విమర్శించారు.

## నేటి నుండి తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలు

**సెప్టెంబర్ 17 వరకు రాష్ట్ర వ్యాప్తింగా ప్రదర్శనలు, సమావేశాలు**

**నేడు హైదరాబాద్‌లోని మఖ్దూం మొహినుద్దీన్, అంబేద్కర్ విగ్రహం వరకు ప్రదర్శన**

**సెప్టెంబర్ 17న రావినారాయణరెడ్డిలో ఆడిటోరియంలో ముగింపు సభ**

**సీపీఐ, రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు**

**హైదరాబాద్, మహా :** రాష్ట్ర వ్యాపితంగా సెప్టెంబర్ 11 నుండి 17 వరకు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను ఘనంగా నిర్వహించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. ఉత్సవాల ప్రారంభ సూచికగా గురువారం సెప్టెంబర్ 11వ తేదీన ట్యాంక్‌బండ్‌పై ఉన్న మఖ్దూం మొహినోయుద్దీన్ విగ్రహం నుండి అంబేద్కర్ విగ్రహం వరకు ఎర్ర చొక్కాలు, ఎర్ర చీరలతో పురుషులు, మహిళ ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు. ఈ వారోత్సవాలు రాష్ట్ర వ్యాపితంగా సెప్టెంబర్ 11 ప్రారంభమైన నాటి నుండి ఆయా జిల్లాలలోని తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట కేంద్రాలలో జరుగుతాయని, ఈ ఉత్సవాలకు రాష్ట్ర, జిల్లా నాయకత్వం పాల్గొననున్నదని తెలిపారు. సెప్టెంబర్ 17వ తేదీన ముగింపు ఉత్సవాలను హైదరాబాద్‌లోని రావి నారాయణ ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు సాంబశివరావు వివరించారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ఎలాంటి పాత్ర, చరిత్ర లేని బీజేపీ దుష్ప్రచారం చేస్తున్నదని, పోరాట చరిత్రను వక్రీకరిస్తున్నదని మండిపడ్డారు. బీజేపీ చేస్తున్న దుష్ట పన్నాగాలను ఎండగడుతూ రాష్ట్ర వ్యాపితంగా పార్టీ శ్రేణులు సాధ్యమైన చోట్ల సభలు, సదస్సులు, సెమినార్లు నిర్వహిస్తుందని తెలిపారు. నిజాం రాచరిక, భూస్వామ్య వ్యవస్థల కబంధ హస్తాల నుండి విముక్తి కల్పించేందుకు నాడు కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో మట్టి మనుషులు చేసిన మహత్తర పోరాటం ప్రపంచ చరిత్రలోనే విశిష్టమైనదన్నారు. ఈ పోరాటంలో నాలుగున్నర వేల మంది తెలంగాణ మాతృభూమి స్వాతంత్ర్యం కోసం అసువులు బాసారని గుర్తు చేశారు. వారోత్సవాల సందర్భంగా నాటి ఘన చరిత్రను మననం చేసుకొని స్ఫూర్తి పొందడం ప్రతి ఒక్కరి కర్తవ్యమని సాంబశివరావు పేర్కొన్నారు.

మీరు జర్నలిస్ట్ అవ్వాలనుకుంటున్నారా?
ANN SCHOOL OF JOURNALISM TELUGU ESTD.2025
జర్నలిజంలో రాణించి సమాజంలో జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలను అరికట్టాలనుకుంటున్నారా? అయితే మీకిదే సువర్ణావకాశం
ANN SCHOOL OF JOURNALISMలో
జాయిన్ అయ్యి నిజమైన జర్నలిస్టులుగా గుర్తింపు తెచ్చుకోండి.
గృహిణులు, నిరుద్యోగులు, విద్యార్థులకు
ఇదే మా ఆహ్వానం
అడ్మిషన్లు ప్రారంభమైనవి
అప్లికేషన్‌కు ఆఖరుతేదీ - సెప్టెంబర్ 12
తరగతులు ప్రారంభం : సెప్టెంబర్ 22
పరిమితమైన సీట్లు, సీనియర్ పాత్రికేయులతో విద్యాబోధన
మీరున్న చోటు నుండే ఆన్‌లైన్‌లో జర్నలిజం క్లాసులు
HURRY UP! LIMITED TIME త్వరపడండి...
8 వారాలు, 16 ఆన్‌లైన్ క్లాసులు
కోర్సు పూర్తైన విద్యార్థులకు జర్నలిజం సర్టిఫికెట్ ఇవ్వబడును
మెరిట్ స్టూడెంట్స్ కు ఇంటర్న్ షిప్ అవకాశం.. రికమండేషన్ లెటర్
FOR ADMISSIONS CONTACT: +91 74369 39999
SCAN ME
APPLY ON OUR OFFICIAL WEBSITE: WWW.ANNSCHOOLOFJOURNALISM.COM

ఉద్యోగావకాశం
పత్రికా రంగంలో నూతన ఒరవడి సృష్టిస్తున్న
మహా పత్రికకు
(RNI NO : APTEL/2003/09316)
ఏపీ, తెలంగాణలోని అన్ని ప్రాంతాలకు జిల్లాల వారీగా
స్టాఫ్ రిపోర్టర్లు కావలెను
WWW.EPAPER.MAHAADAILY.COM
ఆసక్తి గల వారు సంప్రదించండి
MAHAAPATRIKA@GMAIL.COM,
95501 59679, 90001 41919

మహా పత్రిక
WWW.MAHAADAILY.COM | సంపాదకీయం | EDITORIAL | గురువారం, హైదరాబాద్ | 11-09-2025
ANN తెలుగు

EDITORIAL
సంపాదకీయం

# ట్రంప్ డబుల్ గేమ్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ డబుల్ గేమ్ ఆడుతూ.. మిత్రదేశాల ముందు పలుచనవుతున్నాడు. ముందునుంచి భారత్‌తో ట్రిపుల్ ఆర్ సినిమాలోని దోస్తీ పాట పాడుతున్న ట్రంప్, వెనుక నుంచి మాత్రం బాహుబలి సినిమాలోని కట్టప్పలా వెన్నుపోటు పొడుస్తున్నట్లు ఇటు భారతీయులు, అటు అమెరికన్లు కూడా మొత్తుకుంటున్నారు. ఆయన ట్రంపరి టక్కరి బుద్ధి మాత్రం బయటపెడుతూనే ఉన్నాడు. భారత్‌తో చర్చలకు తాను సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించిన ట్రంప్, మరోవైపు ఢిల్లీపై వందశాతం సుంకాలను విధించాలని ఐరోపా దేశాలను కోరడం డబుల్ గేమ్‌కు అద్దం పడుతోంది. రష్యా, ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించే అంశం ఓ కొలిక్కి రాకపోవడంతో అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌లో నైరాశ్యం మునిగిపోయాడు. అందుకే భారత్‌తో చర్చలకు సిద్ధమని ప్రకటించిన అమెరికా అధ్యక్షుడు మరోవైపు ఢిల్లీపై వందశాతం సుంకాలను విధించాలని ఐరోపా దేశాలను కోరినట్లు తెలుస్తోంది. ఉక్రెయిన్ యుద్ధం ముగించే అంశంపై విశ్వప్రయత్నాలు చేస్తున్న ట్రంప్, రష్యాపై ఒత్తిడి తీసుకురావాలని యోచిస్తున్నారు. అందులో భాగంగా భారత్, చైనాలపై సుంకాల భారాన్ని పెంచి మాస్కోను కట్టడి చేయాలని ప్రణాళికలు వేస్తున్నారు. మిత్రదేశంగా చెప్పుకుంటూనే మనదేశంపై భారీ సుంకాలు విధించిన ట్రంప్ మరో మిత్ర దేశం ఖతార్ విషయంలోనూ అదే గేమ్ షురూ చేశాడు. హమాస్ నేతలను అంతమొందిస్తామని చెప్తూ ఇజ్రాయెల్ ఖతార్ రాజధాని దోహాపై వైమానిక దాడులు చేపట్టిన విషయం తెలిసిందే. గాజాలో కాల్పుల విరమణ విషయంలో అమెరికా చేసిన ప్రతిపాదనపై ఒకవైపు చర్చలు జరుగుతుండగా మరోవైపు ఈ దాడులు జరగడం గమనార్హం. అయితే దోహాపై దాడి విషయం అమెరికాకు సమాచారం ఉన్నప్పటికీ.. ఆ విషయాన్ని ఖతార్‌కు మాత్రం చెప్పకుండా ఆలస్యం చేసింది. దీన్ని బట్టి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ డబుల్ గేమ్ ఆడుతున్నారనే అనుమానం మొదలయ్యింది.




ఇజ్రాయెల్ జరిపిన ఈ దాడిలో హమాస్ కు చెందిన కీలక నేత ఖలీల్ అల్‌హయ్యా కుమారుడితో సహా ఆరుగురు మృతి చెందినట్లు తెలుస్తోంది. అయితే ఈ దాడి గురించి అమెరికాకు ముందే సమాచారం ఇచ్చామని టెల్‌అవీవ్ స్పష్టం చేసింది. అగ్రరాజ్యం కూడా దాన్ని అంగీకరించింది. ఖతార్‌కు సమాచారం ఇచ్చామని అమెరికా పేర్కొంది. అయితే, దాడులు మొదలైన 10 నిమిషాల తర్వాత యూఎస్ నుంచి తమకు కాల్ వచ్చిందని ఖతార్ విదేశాంగ శాఖ అధికారి ఒకరు ఆసహనం వ్యక్తం చేశారు. పేలుళ్లు జరుగుతుండగా.. అమెరికా అధికారి నుంచి కాల్ వచ్చిందని తెలిపారు. అయితే కాల్పుల విరమణకు సంబంధించి చివరి హెచ్చరికగా యూఎస్ ప్రతిపాదన మేరకే దోహాలో చర్చలు జరుగుతున్నాయన్నారు. అలాంటి సమయంలో ఇజ్రాయెల్ దాడి చేయడాన్ని ఆయన ఖండించారు. కాగా, అయితే ఖతార్ పై దాడులు జరుగుతాయన్న సమాచారం ఉన్నప్పుడు ముందుగానే ఎందుకు చెప్పలేదనే అనుమానాలు ఆ దేశాధికారుల్లో వ్యక్తమవుతున్నాయి. ఇటీవల మిత్రదేశాలతో ట్రంప్ వ్యవహారం చర్చనీయాంశగా మారింది. మిత్ర దేశమంటూనే భారత్‌పై భారీ సుంకాలు విధించిన విషయం తెలిసిందే. తాజా దాడులతో ఖతార్‌తోనూ ట్రంప్ గేమ్ ఆడుతున్నట్లు అనుమానాలు వస్తున్నాయి.

## ద్వితీయ ఆంక్షలకు ...

భారత్, చైనాలపై ద్వితీయ ఆంక్షలు విధిస్తే నెలకొనే పరిణామాలపై ఈయూ నేతలు చర్చలు జరిపారు. ఉక్రెయిన్‌లో త్వరగా శాంతి నెలకొల్పాలని ఈయూ కూడా భావిస్తోంది. ఈక్రమంలో రష్యాను కట్టడి చేస్తేనే అది సాధ్యమవుతుందని ట్రంప్ పేర్కొన్నారు. దీంతో ఈయూ నేతలు కూడా ఆ దిశగా ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. రష్యాపై రెండోవిడత సుంకాలు విధించేందుకు. సిద్ధంగా ఉన్నట్లు ఇప్పటికే ట్రంప్ ప్రకటించారు. రష్యాఉక్రెయిన్ యుద్ధం అంశం కొలిక్కి రాకపోడంతో ట్రంప్ ఎంత నిరాశలో ఉన్నారో ఆయన వైఖరితో స్పష్టమవుతోంది. కాగా, ట్రంప్ భారత్‌తో నెలకొన్న వాణిజ్య అడ్డంకులు తొలగించుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు తన ట్రూత్ సోషల్‌లో ఇటీవల పోస్టు పెట్టారు. ఈసందర్భంగా ప్రధాని మోదీతో మాట్లాడేందుకు ఎదురుచూస్తున్నట్లు తెలిపారు. ఈ చర్చలు రెండు గొప్పదేశాలకు మంచి ఫలితాలు ఇస్తాయని ఆశిస్తున్నట్లు వెల్లడించారు. దీంతో సుంకాలకు సంబంధించి ఇటీవలి వరకు భారత్‌పై ఘాటు వ్యాఖ్యలు చేసిన డొనాల్డ్ ట్రంప్ స్వరం రోజురోజుకు మారుతోందని వార్తలు వచ్చాయి. ఇంతలో డబుల్ గేమ్ కనిపించోంది, ఒకసారి మోదీ గొప్పనాయకుడు అంటాడు. మరోసారి మంచి మిత్రుడు అని చెబుతారు. కానీ ట్రంప్ ఎపుడేం చేస్తారో ఆయనకే తెలియదు. త్వరలో ట్రంప్ తో ఫోన్ లో మాట్లాడుతానని మోదీ అన్న కొద్దినిమిషాలకే.. ట్రంప్ తన టక్కరితనం బయటపెట్టుకున్నాడు. భారత్, చైనా, రష్యా మైత్రి ట్రంప్‌కు చుక్కలు చూపిస్తోంది. ఈ నేపథ్యంలో ట్రంప్ తన పెద్దన్నమాత్ర జారిపోతున్నదని కలవరపాటుకు గురవుతున్నట్లు కనబడుతోంది. భారత్ కూడా అమెరికాపై సుంకాలు వేయాలన్న డిమాండ్లు కూడా వినబడుతున్నాయి. కేజ్రీవాల్, శశిథరూర్ లాంటి నేతలు ఇప్పటికే ప్రధాని మోదీకి దీనిపై సూచనలు చేశారు.

### అమూల్యమైన జీవితం ఆత్మహత్యలతో

# అంతం కారాదు

### సెప్టెంబర్ 10, ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం

ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 10న ప్రపంచవ్యాప్తంగా ఆత్మహత్యల నివారణ దినోత్సవంగా జరుపుకుంటారు. పెరుగుతున్న ఆత్మహత్యల సమస్యపై ప్రజలలో అవగాహన కల్పించడం, ప్రతి ఒక్కరికీ జీవితం విలువైనదని గుర్తుచేయడం ఈ దినం యొక్క ముఖ్య ఉద్దేశ్యం.ఆత్మహత్యలు అనేవి వ్యక్తిగత నిర్ణయాల వలె కనిపించినప్పటికీ, వాటి వెనుక సామాజిక, ఆర్థిక, మానసిక కారణాలు ఉంటాయి. ఈ సమస్య ఒకరి జీవితాన్ని మాత్రమే కాదు, కుటుంబాన్ని, సమాజాన్ని, దేశాన్ని కూడా దెబ్బతీస్తుంది. అందుకే ప్రపంచవ్యాప్తంగా ఈ సమస్యను తగ్గించేందుకు చర్యలు తీసుకోవడం అత్యవసరం. మనిషి జీవితం ఎప్పుడూ సాఫీగా సాగదు. కష్టాలు, సమస్యలు ప్రతి ఒక్కరి జీవితంలో సహజం. కానీ ఆ సమస్యలను తట్టుకోలేక కొందరు ఆత్మహత్య అనే నిర్ణయం తీసుకుంటారు. ముఖ్యంగా యువతలో ఆత్మహత్యలు ఎక్కువగా కనిపిస్తాయి. విద్యలో ఒత్తిడి, ప్రేమలో విఫలత, ఉద్యోగం దొరకకపోవడం, ఆర్థిక సమస్యలు, కుటుంబ కలహాలు వంటి పరిస్థితులు వారిని ఆ దిశలోకి నెడతాయి. కొందరికి దీర్ఘకాలిక అనారోగ్యం, డిప్రెషన్, ఆందోళన వంటి మానసిక సమస్యలు ఉండడం కూడా పెద్ద కారణమే. ఈ నిర్ణయం ఒక వ్యక్తికి మాత్రమే కాకుండా, ఆ వ్యక్తి కుటుంబానికి, బంధువులకు జీవితాంతం మిగిలే గాయాన్ని మిగిల్చేస్తుంది. ఆత్మహత్యల కారణాలను పరిశీలిస్తే మానసిక ఆరోగ్యానికి సంబంధించిన సమస్యలు ముఖ్యంగా కనిపిస్తాయి. ఆధునిక జీవన విధానం, పోటీలు, సాంకేతికత ప్రభావం, ఒంటరితనం ఇవన్నీ మనిషి మనసును బలహీనపరుస్తాయి. చాలా సందర్భాల్లో చిన్న సమస్యలు కూడా పెద్దవిగా కనిపించి, జీవితాన్ని అసహనంగా అనిపించేస్తాయి. ఇలాంటి పరిస్థితుల్లో మనుషులు సహాయం కోరడం కంటే మౌనం వహిస్తారు. తమ బాధను ఇతరులతో పంచుకోవడానికి వెనుకాడతారు. అలా సమస్యలు లోపల పెరిగి చివరికి ఆత్మహత్య నిర్ణయానికి దారితీస్తాయి.ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం మనకు ఇచ్చే ప్రధాన సందేశం ఏమిటంటే – జీవితం విలువైనది. ఎలాంటి సమస్య వచ్చినా దానికి పరిష్కారం ఎప్పుడూ ఉంటుంది. కానీ జీవితం ఒక్కసారి కోల్పోతే తిరిగి దొరకదు. ఈ దినం మనకు ఒక హెచ్చరిక మాత్రమే కాదు, ఆశ మరియు సహాయానికి నిదర్శనం కూడా. మన చుట్టుపక్కల ఉన్న వారిలో ఎవరికైనా నిరాశ, డిప్రెషన్, సమస్యల



భారంతో కుంగిపోతున్నట్లు అనిపిస్తే వారితో మాట్లాడాలి. వారిని అర్థం చేసుకోవాలి. అవసరమైతే వైద్యుల సహాయం పొందడానికి ప్రోత్సహించాలి.

చిన్నమాట, చిన్నసానుభూతి, చిన్నసహాయం కూడా ఒకరి ప్రాణాన్ని కాపాడగలదు. మన సమాజంలో ఆత్మహత్యలను నివారించాలంటే మానసిక ఆరోగ్యంపై సరైన చర్చలు జరగాలి. ఇప్పటికీ మన దగ్గర మానసిక వ్యాధుల గురించి మాట్లాడటాన్ని చాలా మంది అపహాస్యంగా చూస్తారు. కానీ డిప్రెషన్, ఆందోళన, ఒత్తిడి వంటి సమస్యలు కూడా శారీరక వ్యాధుల్లాగే సాధారణం. వాటికి చికిత్స అవసరం. పాఠశాలలు, కళాశాలలు విద్యార్థుల్లో మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించాలి. సమస్యలను పంచుకోవడం, సహాయం కోరడం బలహీనత కాదని వారికి అర్థం చేయాలి. అలాగే ప్రభుత్వాలు హెల్ప్‌లైన్ సెంటర్లను ఏర్పాటు చేయడం, కౌన్సెలింగ్ సేవలు అందుబాటులో ఉంచడం చాలా అవసరం.ఈ దినం సందర్భంగా ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవలసిన విషయం ఏమిటంటే – మనం ఎదుర్కొనే కష్టాలు తాత్కాలికం, కానీ మన జీవితం శాశ్వతమైనది. మనసులోని బాధను మనకు దగ్గరైన వారితో పంచుకోవాలి. స్నేహితులు, కుటుంబ సభ్యులు కూడా ఒకరినొకరు గమనిస్తూ, తోడుగా నిలవాలి. జీవితం అనేది కేవలం మనకే కాకుండా మన కిష్టమైన వారి కోసం కూడా విలువైనది. ఒక వ్యక్తి తీసుకునే ఆత్మహత్య నిర్ణయం కుటుంబానికి, సమాజానికి తిరుగులేని నష్టాన్ని కలిగిస్తుంది.ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం మనందరికీ ఒక హెచ్చరికతో పాటు, ఆశ మరియు బలాన్ని అందిస్తుంది. జీవితంలో ఎన్ని కష్టాలు వచ్చినా ధైర్యంగా నిలబడాలి. సమస్యలకు పరిష్కారాలు ఉంటాయి కానీ జీవితం రెండోసారి రాదు. కాబట్టి మనం కలసి ముందుకు సాగితేనే ఆత్మహత్యలను తగ్గించగలం. మనలో ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవాలి.జీవితం అమూల్యమైనది. ప్రతి క్షణం విలువైనది. కాబట్టి ఆత్మహత్యల వైపు ఆలోచించకుండా ఉండాలి.

- పిన్నింటి బాలాజీ రావు,
9866776286

### నేపాల్ నిరసనల వెనుక

# ఈయనేనా?



సోషల్ మీడియాపై నిషేధం ఏకంగా నేపాల్‌లో రాజకీయ సంక్షోభాన్ని సృష్టించింది. యువత చేపట్టిన ఆందోళనలు హింసాత్మకంగా మారి, చివరకు ఆ దేశ అధ్యక్షుడు రామచంద్ర పౌడల్, ప్రధాన మంత్రి కేపీ శర్మ ఓలీలు పదవి నుంచి తప్పుకోవాల్సి వచ్చింది. అయితే, యువత నిరసనల వెనుక ఓ యువనాయకుడు ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. అంతేకాదు, ఆయనే తదుపరి నేపాల్ ప్రధానిగా అయనే ఉండాలని ఆన్‌లైన్ క్యాంపెన్ ఊపందుకుంది. దీంతో యువత జనరల్ జెడ్ పేరుతో చేపట్టిన ఆందోళనలో ఆయనే కీలకంగా వ్యవహరించారనే అనుమానాలు బలపడుతున్నాయి. గతవారం ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్, ఎక్స్ (ట్విట్టర్) వంటి 26 సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్‌ను నిషేధిస్తూ ప్రభుత్వ తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా యువత గళమెత్తింది. దీంతో పాటు నేపాల్ ప్రభుత్వ వ్యవస్థలో అవినీతి కూడా తారాస్థాయికి చేరుకోవడం ఆగ్రహం వ్యక్తం చేశారు. వారు చేపట్టిన ఆందోళనలు రక్తసిక్తంగా మారి 19 మంది ప్రాణాలు కోల్పోగా.. వంద మందికిపైగా గాయపడ్డారు. ఒక్క రాజధాని ఖాట్మండూలోనే 18 మంది మృతిచెందారు. వీరిలో చాలా మంది స్కూల్, కాలేజీ యూనిఫామ్స్‌లో ఉన్న విద్యార్థులే. ఇదిలా ఉండగా, ఈ ఆందోళనలకు సంఘీభావం ప్రకటించిన బాలెన్ షా.. తన వయసు కారణంగా ప్రత్యక్షంగా నిరసనల్లో పాల్గొనలేకపోతున్నానని ఫేస్‌బుక్‌లో పోస్ట్ పెట్టారు. జనరల్ జెడ్ ఆందోళనల్లో 28 ఏళ్లలోపు యువతే పాల్గొనాలని నిర్వాహకులు పరిమితి విధించారు.

## నేపాల్ కొత్త ప్రధానిగా షా?

''ఈ ర్యాలీ స్పష్టంగా జనరల్‌జెడ్ ఆకస్మిక ఉద్యమం.. నేను కూడా వారికంటే వయసులో పెద్దవాడిని.... నేను వారి ఆకాంక్షలు, లక్ష్యాలు, ఆలోచనలను అర్థం చేసుకోవాలనుకుంటున్నాను.. రాజకీయ పార్టీలు, నాయకులు, కార్యకర్తలు, శాసనసభ్యులు, ప్రచారకులు ఈ ర్యాలీని తమ సొంత ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవడానికి ప్రయత్నించవద్దు.. నేను భౌతికంగా హాజరు కానప్పటికీ నా పూర్తి మద్దతు యువతకు ఉంది'' అని ఆయన అన్నారు. ఇక, సోషల్ మీడియాలో పలువురు బాలెన్ ప్రధాన పదవి చేపట్టాలని కోరుకుంటూ పోస్ట్‌లు పెడుతుండటం సంచలనంగా మారింది. ఇదంతా వ్యూహం ప్రకారమే జరిగి ఉంటుందని అనుమానిస్తున్నారు. బాలెన్‌గా గుర్తింపు పొందిన ఆయన అసలు పేరు బాలేంద్ర షా . ప్రస్తుతం కాఠ్మాండూ మేయర్‌గా ఉన్నారు. 1990లో జన్మించిన బాలెన్.. నేపాల్‌లో సివిల్ ఇంజినీరింగ్ అనంతరం భారత్‌లోని విశ్వేశ్వరయ్య టెక్నలాజికల్ యూనివర్సిటీ నుంచి మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేశారు. రాజకీయాల్లోకి రాకముందు నేపాల్ అండర్‌గ్రౌండ్ హిప్‌హాప్ సన్నివేశంలో ర్యాపర్, గేయ రచయితగా చురుకుగా ఉండేవారు, తరచూ తన సంగీతం ద్వారా అవినీతి, అసమానత వంటి అంశాలను లేవనెత్తారు. తొలిసారి 2022 కాఠ్మాండూ మేయర్ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి.. 60వేలకుపైగా భారీ ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఆ ఎన్నికల్లో 'బాలెన్ ఎఫెక్ట్' పేరుతో పాపులర్ అయి.. యువతను ఆకట్టుకున్నారు. ఆయన భార్య సబీనా కఫ్లే కూడా సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటారు. అయితే, గతేడాది ఫిబ్రవరిలో నేపాల్‌లో అమెరికా రాయబారిని షా కలవడం గమనార్హం. 'బంగ్లాదేశ్, శ్రీలంక, నేపాల్ మధ్య ఉన్న తేడా ఏమిటంటే, మన మధ్య వ్యక్తిగత ఆసక్తి లేకుండా దేశ మంచి కోసం మాత్రమే పనిచేసే వ్యక్తి ఉన్నారు. ఆయనే కాబోయే ప్రధాని బాలెన్'' అని అనేకమంది నెటిజన్లు పోస్టులు పెడుతుండడంతో ఈ ప్రచారానికి ఊతం లభిస్తోంది.

రచనలకు ఆహ్వానం
ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.
మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp-
7436939999

# నేనూ కష్టపడి పైకొచ్చిన-ట్రిపుల్ ఐటీ విద్యార్థులతో మంత్రి జూపల్లి ముచ్చట



**ఆదిలాబాద్ మహా :** బాసర ట్రిపుల్ ఐటీ ని రాష్ట్ర ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు సందర్శించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.అనంతరం కాసేపు ముచ్చటించారు. బాసర అభివృద్ధితో పాటు ఇక్కడి విద్యార్థులకు మరిన్ని ఉపాధి అవకాశాలు కల్పించేలా వివిధ చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో ట్రిపుల్ ఐటీని అద్భుతంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు.విద్యార్థులతో తన అనుభవాలను పంచుకున్నారు. గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చి కష్టాలను అధిగమించి ఈ స్థాయికి చేరుకున్నానని విద్యార్థుల్లో ప్రేరణ కలిగించారు. నేటి యువత జీవితంలో ఫెయిల్ అయ్యామనో, సబ్జెక్ట్ తప్పామనో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, జీవితంలో ఒడిదొడుకులు సహజమని, వాటిని అధిగమించి విజయం సాధించాలని మోటివేట్ చేశారు.సంస్కృతి అంటే కేవలం ఆటపాటలు, నాట్యం, సంగీతం, సాహిత్యం, కవిత్వం, భాషకే పరిమితం కాదని, సంస్కృతి అంటే మన అస్తిత్వం. ప్రజల జీవన విధానయని అన్నారు. అయితే ప్రజల జీవన విధానం ధ్వంసమైందని, ప్రజలో ఆలోచన ధోరణి మారిందని, ప్రజల జీవన విధానం గతి తప్పడం వల్లే అనేక పెడ ధోరణులు చోటు చేసుకుంటున్నాయని పేర్కొన్నారు.

ఆహారపు అలవాట్లు మారి అనారోగ్యం బారిన పడుతున్నారని అన్నారు. మొబైల్ ఫోన్లలో మునిగి తేలుతూ విలువైన సమయాన్ని వృధా చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఎంతో వేడుకగా , ఉత్సాహంగా పండగలను జరుపుకునేవారు. మొబైల్ ఫోన్స్ లోనే వినోదాన్ని పొందుతూ ఆట పాటలను మరిచిపోతున్నారని అన్నారు. చదువుతో పాటు విద్యార్థులు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని, మానసిక, శారీరక ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని, నృత్యం, సంగీతం, కళల పట్ల ఆసక్తి పెంచుకోవాలని కోరారు. బాసర ట్రిపుల్ ఐటికి సాంస్కృతిక శాఖ తరపున కోటి రూపాయలు మంజూరు చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దండె విఠల్, జిల్లా కలెక్టర్ అభిలాష్ అభినవ్, అడిషనల్ కలెక్టర్ ఫైజన్ అహ్మద్, మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాల చారి, మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి మాజీ ఎమ్మెల్యేలు విఠల్ రెడ్డి , నారాయణ రావు పటేల్,రేఖానాయక్ తదితరులు పాల్గొన్నారు



## రోడ్డును సరి చేయండి

**ముచ్చింతల గ్రామస్తులు ఎమ్మార్వో వినతులు**

**రాజేంద్రనగర్, మహా ;** శంషాబాద్ మండలం ముచ్చింతల గ్రామం నుండి పాల్మాకుల్ కు వెళ్లే రహదారి రోడ్డును సరి చేయండి అంటూ ముచ్చింతల గ్రామస్తులు ఎమ్మార్వో రవీందర్ దత్త్ కు బుధవారం వినతిపత్రం అందజేశారు. గత 20 సంవత్సరాల నుండి ముచ్చింతల్ వయా పాల్మాకుల్ రహదారిని తమ గ్రామస్తులు వాడుతున్నారు. గత వారం కురిసిన వర్షానికి రోడ్లన్నీ గుంతల మయం చెట్లతో రోడ్డు ఇరువైపులా కూరుకుపోయింది. మా గ్రామం నుండి పాల్మాకుల్ వరకు రాకపోకలు నిలిచిపోయాయి. గ్రామంలోని రైతులు సంతకు వెళ్లి కూరగాయలు అమ్ముకోవడానికి, ఇతర సామాగ్రి కొనుక్కోవడానికి వీలు లేకుండా పోయింది. మా గ్రామ ప్రజలు పాల్మాకుల్ నుండి రావడానికి రాంగ్ రూట్ ను మార్గంగా వినియోగించుకుంటున్నారు. రాంగ్ రూట్లో వెళ్లడం వల్ల ఎంతోమంది ప్రజలు ప్రమాదాలకు గురై మరణించారు. ఇలాంటి సంఘటనలు జరగకుండా మా గ్రామ ప్రజల ప్రాణాలను రక్షించి ముచ్చింతల నుంచి పాలమాకులకి రోడ్డు మార్గం సరిచేయాలని ఎమ్మార్వో రవీందర్ దత్త్ కు గ్రామస్తులు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షులు కత్తుల జనార్ధన్, కత్తుల భాస్కర్, కత్తుల సత్తిపండు, ఎండి మహమ్మద్, కత్తుల యాదయ్య, సామెల్, నరసింహ, యాదయ్య, నవీన్ ప్రశాంత్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## పేకాట రాయుళ్లపై దాడి.. అరెస్ట్

**రంగారెడ్డి జిల్లా మహా:** ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో పేకాట రాయుళ్లపై, ఎస్వోటీ పోలీసులు దాడి చేసి అరెస్టు ఘటన చోటు చేసుకుంది. ఇబ్రహీంపట్నం మండలం, ఎలిమినేడు గ్రామంలో గుట్టు చప్పుడు కాకుండా, వ్యవసాయ పొలంలో పేకాట ఆడుతున్న, పేకాట స్థావరంపై ఎస్ఓటీ పోలీసులు దాడి చేశారు. వారి వద్ద నుండి రూ.55,000 నగదు, నాలుగు మొబైల్ ఫోన్లు, ఒక మోటర్ సైకిల్ స్వాధీనం చేసుకుని, ఐదుగురిని అరెస్టు చేశారు. పక్కా సమాచారంతోనే ఈ దాడి చేసినట్లు ఎస్ఓటి పోలీసులు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## నానమ్మ, మనవరాలు అనుమానస్పద మృతి

**మంచిర్యాల హమాలీవాడలో ఘటన**

**మంచిర్యాల, మహా :** మంచిర్యాల పోలీస్ స్టేషన్ పరిధి హమాలివాడలో నానమ్మ సత్యవతి (50) మనవరాలు శిరీష (4) అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన బుధవారం కలకలం రేపింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం... బెజ్జాల సత్యవతి (54) అనే మహిళకు ఇద్దరు కుమారులు ఉన్నారని అన్నారు. ఒకరు హిజ్రాగా మారాగా మరొకరు గోపాలవాడలో నివాసముంటు కొంతకాలం క్రితం అతడు మృతి చెందినట్లు చెప్పారు. గత కొన్ని రోజుల క్రితం ఇంటి నుండి వెళ్లిపోయిన కుమారుడు తిరిగి వచ్చినట్లు సమాచారం. కాగా తిరిగి వచ్చిన కుమారుడికి ఆరోగ్య సమస్య రావడంతో ఖమ్మంకు వెళ్ళిపోయినట్లు సమాచారం. ఈ క్రమంలో తల్లి, కుమారుడు ఖాళీగా ఉన్న వారి నివాసాన్ని అమ్మడం కొరకు కొంతమంది బ్రోకర్లకు తెలిపినట్లు తెలుస్తోంది. వెళ్లిన కొడుకు బుధవారం తల్లికి ఫోన్ చేయగా ఎంతకు తీయకపోవడంతో ఇంటి పక్కన వారికి సమాచారం అందించిన ఫలితం లేకపోవడంతో చివరకు పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న బ్లూ కోల్ట్ సిబ్బంది ఘటన స్థలానికి వెళ్లి తలుపులు పగలగొట్టి ఇంట్లోకి వెళ్లేసరికి పడక గదిలో బెడ్ పై నానమ్మ, మనవరాలు నిర్జీవంగా ఉన్నారని చెప్పారు. వీరిద్దరూ ఆత్మహత్య చేసుకున్నారా...? లేక హత్యనా..? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం పూర్తి వివరాలు తెలియజేస్తామని పోలీసులు వెల్లడించారు.

### గ్రామీణ ప్రాంత రోడ్లను అభివృద్ధి చేసేందుకు

## ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోంది



**భూపాలపల్లి, మహా :** భూపాలపల్లి నియోజకవర్గంలోని అంతర్గత రోడ్లు, గ్రామీణ ప్రాంత రోడ్లను అభివృద్ధి చేసేందుకు ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని, నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. బుధవారం భూపాలపల్లి నియోజకవర్గంలోని రేగొండ మరియు కొత్తపల్లిగోరి మండలాల్లోని వివిధ గ్రామాలల్లో ఎమ్మెల్యే పర్యటించారు. మొత్తం రూ.14 కోట్ల 75 లక్షలతో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు మరియు ప్రారంభోత్సవాలు చేశారు. కొత్తపల్లిగోరి మండలం సుల్తాన్ పూర్ లో సుల్తాన్ పూర్ గ్రామం నుండి కొత్తపల్లి (వయా వెంకటేశ్వర్లపల్లి, కోనరావు పేట)గ్రామం వరకు సీఆర్ఆర్ నిధులు రూ.450 లక్షలు+ఐటీడీఏ నిధులు రూ.275 లక్షలతో నిర్మించనున్న నూతన బీటీ రోడ్డు నిర్మాణ పనులకు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తో కలిసి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు శంకుస్థాపన చేశారు. రేగొండ మండలం భాగిర్థిపేట గ్రామంలో ఊరకుంట మత్తడి నుండి వ్యవసాయ పొలాల వరకు రోడ్డు రూ.30 లక్షలు, గూడెపల్లి గ్రామంలో గూడెపల్లి నుండి పొనగండ్ల వరకు రోడ్డు నిర్మాణ పనులు రూ.160 లక్షలు, కొడవటంచ గ్రామంలో రూ.29 లక్షలతో కొత్తగా నిర్మించిన హెల్త్ సబ్ సెంటర్ ను ప్రారంభించారు. దమ్మన్నపేట గ్రామంలో పోచమ్మ ఆలయ నిర్మాణ పనులకు రూ.4.95 లక్షలతో శంకుస్థాపన చేశారు. కొత్తపల్లిగోరి మండలం వెంకటేశ్వర్లపల్లి గ్రామంలో మైదాకులపల్లి నుండి బుగులోనిజాతర వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులకు రూ.150 లక్షలు, సూరవాడ నుండి ఎరుకలివారికుంట వరకు వయా శ్మశానవాటిక రోడ్డు నిర్మాణ పనులు రూ.30 లక్షలు, సుల్తాన్ పూర్ తాటివనం నుండి వ్యవసాయ పొలాల వరకు రోడ్డు నిర్మాణ పనులు రూ.50 లక్షలు, కొత్తపల్లిగోరి లో కొమ్మాల చెరువు నుండి వాగు వరకు రోడ్డు నిర్మాణ పనులు రూ.20 లక్షలు, పప్పుల రవి పొలం నుండి రావుల బాపురావు పొలం వరకు రోడ్డు నిర్మాణ పనులు రూ.40 లక్షలు, నిజాంపల్లి గ్రామంలో గూడపైడి ఇంటి నుంచి ఓదెల అశోక్ పొలం వరకు రోడ్డు నిర్మాణ పనులు రూ.40 లక్షలు, చిన్నకోడెపాకలో బండి మల్లయ్య ఇంటి నుంచి మాటు వరకు రోడ్డు నిర్మాణ పనులు రూ.20 లక్షలతో అభివృద్ధి పనులకు ప్రజా ప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నేతలతో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపనలు చేశారు. అనంతరం ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యే మాట్లాడారు. పార్టీలకతీతంగా అన్ని గ్రామాలను అభివృద్ధి పరచనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ప్రజాప్రతినిధుల సమన్వయంతో, ప్రజల భాగస్వామ్యంతో సీఎం నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం అభివృద్ధి చేయడానికి దోహదపడుతుందని తెలిపారు. ఈరోజు నాణ్యతతో పాటు సకాలంలో పూర్తయ్యేలా కాంట్రాక్టర్లు, గుత్తేదారులు జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేస్తూ, ప్రతి గ్రామంలో సమగ్రాభివృద్ధి సాధించడమే తమ లక్ష్యమని ఎమ్మెల్యే చెప్పారు. వెంకటేశ్వర్లపల్లిలో గ్రామ గ్రామైఖ్య భవనం మంజూరు చేయాలి వెంకటేశ్వర్లపల్లి గ్రామంలో గ్రామ గ్రామైఖ్య భవనం మంజూరు చేయాలని కోరుతూ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావుకు శివమణి గ్రామైఖ్య మహిళలు తమ వినతిపత్రాన్ని అందజేశారు. గ్రామంలో మొత్తం 25 సంఘాలు 320 మంది సభ్యులు ఉన్నారని, ప్రతి నెల సమావేశాలు ఏర్పాటు చేసుకోవడానికి గది లేకపోవడం ఇబ్బందిగా ఉందని ఎమ్మెల్యేకు సభ్యులు తెలిపారు. కాగా, ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. త్వరలోనే భవనం మంజూరు ఇచ్చి శంకుస్థాపనకు మళ్ళీ వెంకటేశ్వర్లపల్లి గ్రామానికి వస్తానని ఎమ్మెల్యే చెప్పారు.

## అన్నపై గొడ్డలితో దాడి చేసిన కేసులో 5 ఏళ్ల జైలు శిక్ష

**మందమర్రి, మహా :** అన్నపై గొడ్డలితో దాడి చేసి గాయపరచిన కేసులో, మేసినేని కార్తీక్‌కు మంచిర్యాల సెషన్ కోర్టు ఐదు సంవత్సరాల జైలు శిక్ష విధించినట్లు మందమర్రి ఎస్సై రాజశేఖర్ తెలిపారు. ఊరు మందమర్రికి చెందిన మేసినేని కార్తీక్ చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయి మద్యానికి ఇతర దురలవాట్లకు బానిస అయ్యాడని తెలిపారు. ఒకరోజు కార్తీక్ చిన్నమ్మ మేసినేని భీమక్కను డబ్బులు అడగగా తాను ఇవ్వలేదని చెప్పారు. దానితో ఆమెపై కోపం పెంచుకొని బండరాయితో తలపై దాడి చేశాడని వివరించారు. బాధితురాలు కుమారుడు మేసినేని సంజీవ్ ఈ విషయంపై కార్తీక్‌ను మందలించాడని పేర్కొన్నారు. ఆ కోపాన్ని మనసులో పెట్టుకున్న కార్తీక్, మూడు నెలల తర్వాత సంజీవ్ ఇంట్లో ఉన్నప్పుడు గొడ్డలితో తలపై దాడి చేశాడని తెలిపారు. ఈ దాడిపై ఫిర్యాదులు అందుకున్న అప్పటి ఎస్ఐ శివకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారని చెప్పారు. తర్వాత ఆ కేసును ఎస్ఐ భూమేష్‌కి బదిలీ చేయగా, ఆయన విచారణ జరిపి నిందితుడిని జైలుకు పంపించారని అన్నారు. కేసు విచారణ సమయంలో నిందితుడికి శిక్షపడేలా కృషిచేసిన ఎస్సై రాజశేఖర్, సీఐ శశిధర్ రెడ్డి లను బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, మంచిర్యాల డీసీపీ ఇగ్గెటి భాస్కర్ అభినందించినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ, "నేరం చేసిన వారు ఎంతటి వారైనా సరే కోర్టు నుంచి తప్పించుకోలేరు," అని స్పష్టం చేశారు.

## అణిచివేతను ప్రశ్నించిన వీరవనిత చాకలి ఐలమ్మ

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల, మహా :** తెలంగాణ సాయుధ, భూపోరాట ఉద్యమంలో కీలకపాత్ర పోషించి పెత్తందారుల అణిచివేతను ప్రశ్నించిన వీరవనిత చాకలి ఐలమ్మ అని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ కొనియాడారు. బుధవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి పురుషోత్తం నాయక్, వివిధ శాఖల జిల్లా అధికారులు, వివిధ సంఘాల నాయకులతో కలిసి హాజరై ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పెత్తందారుల అణచివేతను ప్రశ్నించిన వీరవనిత చాకలి ఐలమ్మ అందరికీ ఆదర్శంగా నిలిచారని అన్నారు. భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం పోరాడిందని, సాగు చేసే వారికి భూమి కోసం ఉద్యమించిందని తెలిపారు. తెలంగాణ భూ పోరాటానికి నాంది పలికిన మొదటి వ్యక్తి చాకలి ఐలమ్మ అని పేర్కొన్నారు.

## సామాజిక సమానత్వం కోసం పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ

**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**

**భూపాలపల్లి, మహా :** సమాజంలో అన్యాయం, అణచివేతలకు వ్యతిరేకంగా ధైర్యంగా పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ స్ఫూర్తిదాయక జీవితం నేటి తరాలకు మార్గదర్శకమని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పేర్కొన్నారు. .చాకలి ఐలమ్మ 40వ వర్ధంతి సందర్భంగా బుధవారం ఐడిఓసి కార్యాలయంలో జిల్లా సాంఘీక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ కుల సంఘాల ప్రతినిధులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి, ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చాకలి ఐలమ్మ సామాజిక సమానత్వం కోసం, అణచివేతకు వ్యతిరేకంగా తన జీవితాన్ని త్యాగం చేసారని అన్నారు. ఐలమ్మ పోరాటం కేవలం ఒక వర్గానికే కాకుండా మొత్తం సమాజానికి స్ఫూర్తిదాయకమని, నేటి యువత ఐలమ్మ ధైర్యసాహసాలను ఆదర్శంగా తీసుకొని సమాజంలో న్యాయం, సమానత్వం నెలకొల్పడానికి కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి ఇందిర, జిల్లా అధికారులు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

### కాటారంలో ఘనంగా చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలు

**కాటారం, మహా :** కాటారం మండల కేంద్రం గారేపల్లి గ్రామంలో బుధవారం చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు అవతారం గ్రామపంచాయతీ రజక సంఘం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. గ్రామ శాఖ అధ్యక్షుడు నర్సయ్య, సురేష్ లతో పాటు బిఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు రామిల్ల కిరణ్ సభ్యులు నివాళులర్పించారు. తెలంగాణ సాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మ పాత్ర విశేషమైనదని, ఆమె మహిళా చైతన్యం, శక్తికి ప్రతీక అని భూపాలపల్లి వక్తలు పేర్కొన్నారు.

## విద్యార్థులు చదువుతోపాటు క్రీడలలో రాణించాలి

**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**



**భూపాలపల్లి, మహా :** విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలని, క్రీడల్లోనూ చురుకుగా పాల్గొని ప్రతిభను పెంపొందించుకోవాలని భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. బుధవారం గణపురం మండలం, గాంధీ నగర్ లోని మహాత్మా జ్యోతి బా పూలే బాలికల పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు విద్యార్థుల్లో నాణ్యమైన విద్యా ప్రమాణాలు పెంపొందించేందుకు కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలనే తపనతో ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సూచించారు విద్యార్థుల హాజరు, పాఠ్యాంశాలపై అవగాహన, సౌకర్యాలు, మధ్యాహ్న భోజన నిర్వహణను కలెక్టర్ సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ 10 వ తరగతి విద్యార్థులతో మమేకమై ఎలా ఉన్నారు, బాగా చదువుతున్నారా, ఉదయం ఏమి తిన్నారు, ఆహారం బావుంటుందా, సౌకర్యాలు ఎలా ఉన్నాయి, ఆటలు ఆడుతున్నారా అంటూ ఆరా తీశారు పాఠశాలలో విద్యార్థుల విద్య, భోజన, పాఠశాల వాతావరణం, బోధన విధానాలను కలెక్టర్ సమీక్షించారు. విద్యార్థుల సౌకర్యాలను మరింత మెరుగుపరిచే దిశగా ప్రహరి నిర్మాణం, డ్యుయల్ డెస్కులు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిద్దేందుకు ఉపాధ్యాయులు మరింత కృషి చేయాలని సూచించారు.



### నేడు ఆదిలాబాద్ జిల్లాకు రానున్న

## ఇంచార్జి మంత్రి జూపల్లి

**ఆదిలాబాద్ మహా :** తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ ,ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు గురువారం ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించనున్నారు. జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన హాజరు కానున్నారు. ఉదయం 830 గంటలకు నిర్మల్ నుండి బోథ్ చేరుకుంటారు. ఉదయం 930కు బోథ్ లో ఇందిరమ్మ మాడల్ ఇల్లుకు ప్రారంభోత్సవం చేస్తారు.10 నుండి 1130 వరకు స్థానిక పరిచయ ఫంక్షన్ హాల్ లో పలు సంక్షేమ పథకాల లబ్దిదారులకు పత్రాలను పంపిణీ చేస్తారు. మధ్యాహ్నం 1230 కు ఇంద్రవెల్లి చేరుకుని అమరవీరుల స్థూపం ప్రారంభోత్సవంలో పాల్గొంటారు.110 నుండి 2 వరకు ఇంద్రవెల్లి లోని కాగ్నె ఫంక్షన్ హాల్ లో ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు ఇంటి మంజూరు పత్రాలు అందచేస్తారు. మధ్యాహ్నం 230 కు ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి చేరుకుని స్థానిక పెన్ గంగా అతిథి గృహంలో 3 వరకు విశ్రాంతి తీసుకుంటారు. 315 నుండి 330 వరకు భోరజ మండలం పిప్పర్ వాడలో నిర్మాణం పూర్తయిన ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొంటారు. 3.40.నుండి 355 వరకు గిమ్మ గ్రామంలో సీఆర్ఆర్ ఎస్పీపీ నిధులతో సీసీ రోడ్ల పనులకు శంఖుస్థాపన చేయనున్నారు. సాయంత్రం 410 నుండి 5 వరకు గాయత్రి ఫంక్షన్ హాల్ లో పలు సంక్షేమపథకాల లబ్దిదారులతో సమావేశం,అనంతరం సాయంత్రం 510 నుండి 615 వరకు కలెక్టర్ సమావేశ మందిరంలో అధికారులతో రివ్యూ మీటింగ్ నిర్వహిస్తారు. అనంతరం 630 కు హైదరాబాద్ కు పయనమౌతారు.




### బెల్లంపల్లి ప్రభుత్వ పీజీ కళాశాలలో

## సీటు కోసం రిజిస్ట్రేషన్ చేసుకోండి

**ప్రిన్సిపాల్ ప్రముఖ విద్యావేత్త డాక్టర్ కాంపల్లి శంకర్**

**బెల్లంపల్లి,మహా:** బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ మరియు పీజీ కళాశాలలో ఎంఏ ఇంగ్లీష్,ఎంఏ పొలిటికల్ సైన్స్, ఎంకాం కోర్సులలో ప్రవేశానికి రిజిస్ట్రేషన్ ఈ నెల 15వ తేదీలోపు చేసుకోవాలని ప్రిన్సిపల్ ప్రముఖ విద్యావేత్త డాక్టర్ కాంపల్లి శంకర్ తెలిపారు. ఎంఏ పొలిటికల్ సైన్స్ , ఎం ఏ ఇంగ్లీష్, ఎంకాం కోర్సులను సీట్లు ఉన్నాయనిపేర్కొన్నారు. 202526 విద్యా సంవత్సరంలో పీజీలో ప్రవేశానికి కాను టీజీ సిపి గెట్ 2025 రాసి ఉత్తీర్ణులైన విద్యార్థులతో పాటు ఉత్తీర్ణులు కాని ఎస్సీ,ఎస్టీవిద్యార్థుల సైతం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ..18, 19, 20వ తేదీల్లో వెబ్ ఆప్షన్స్.. ఈనెల 18వ తేదీ నుంచి 20వ తేదీ వరకు బెల్లంపల్లి ప్రభుత్వ పీజీ కళాశాలలో సీటు కోసం మొదటి ప్రాధాన్యతగా ఆప్షన్ పెట్టుకోవాలని వివరిం చారు. గత సంవత్సరం ప్రారంభమైన పిజి సెంటర్ విజయవంతంగా కొనసాగుతుందని తెలిపారు. బెల్లంపల్లిలో స్థానికంగా లభిస్తున్న ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని సూచించారు.

## 13న జాతీయ మెగాలోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలి

**బెల్లంపల్లి వన్ టౌన్ సిఐ శ్రీనివాసరావు.. బెల్లంపల్లి రూరల్ సీఐ హనోక్**

**బెల్లంపల్లి ,మహా:** యూదా కేసుల్లో కక్షిదారులుగా ఉన్నవారు ఈనెల 13వ తేదీన జాతీయ మెగా లోక్ ఆధాలత్ నిర్వహిస్తున్నందున కేసులను పరిష్కరించుకునేలా కక్షిదారులు ఉపయోగించుకోవాలని బెల్లంపల్లి వన్ టౌన్ సిఐ శ్రీనివాసరావు, రూరల్ సీఐ హనోక్ లు వెల్లడించారు. రామగుండం కమిషనర్ ఆఫ్ పోలీస్ అంబర్ కిషోర్ జా(ఐపీఎస్) డిఐజి, మంచిర్యాల డిసిపి ఏ.భాస్కర్ ఐపీఎస్ ఉత్తర్వుల మేరకు బెల్లంపల్లి ఏసిపి రవికుమార్ ఆదేశాలతో పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రజలకు ముందస్తు సమాచారం తెలియజేయడం జరుగుతుందని సంయుక్తంగా పేర్కొన్నారు.ఈ అవకాశాన్ని కక్షి దారులందరూ సద్వినియోగం చేసుకోవారిని,చిన్నచిన్నకేసులకుకోర్టులవెంబడితిరుగుతూ తమ విలువైన సమయాన్ని డబ్బులు వృధా చేసుకోకూడదని,ఒకరినొకరు అర్థం చేసుకొని కక్షీదారులందరూ మెగా లోక్ అదాలత్ నూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# పోలీస్ స్టేషన్ ఆవరణలోనే దాడులు



**మంచిర్యాల, మహా :** మంచిర్యాల, నస్పూర్ లలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల ఫ్లెక్సీల లొల్లి, మంగళవారం రాత్రి ఇరుపక్షాలు సై అంటే సై సై తో నస్పూర్ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే....బోనాల జాతర సందర్భంగా అధికార పార్టీ కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీలకు చెందిన నేతలు నస్పూర్ లో ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. అయితే ప్రతిపక్ష నేత, నస్పూర్ 17 వార్డ్ మాజీ కౌన్సిలర్ బేర సత్యనారాయణ ఫ్లెక్సీని కొందరు కాంగ్రెస్ నాయకులు చింపేశారని ఆరోపిస్తూ కేసు పెట్టేందుకు భారత రాష్ట్ర సమితి నాయకులు పోలీస్ స్టేషన్ కు వెళ్లారు. ఈ సమాచారం అందుకున్న కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు మూకుమ్మడిగా పోలీస్ స్టేషన్ ఆవరణకు చేరుకున్నారు. స్టేషన్ లో ఫిర్యాదు అందజేసి బయటికి వస్తున్న కాటం రాజు, బేర సత్యనారాయణపై దాడికి పాల్పడ్డారు. ఎలా గోల పోలీస్ స్టేషన్ లోకి వెళ్లిన బేర సత్యనారాయణ గట్టిగా అరవడంతో పోలీసులు వచ్చి అక్కడున్న నాయకులను వెళ్లగొట్టారు. ఈ సమాచారం అందుకున్న మంచిర్యాల ఏసీపీ ప్రకాశ్ హుటాహుటిన నస్పూర్ పోలీస్ స్టేషన్ కు చేరుకొని పరిస్థితులను సమీక్షించారు. గాయాల పాలైన బీఆర్ఎస్ నాయకులు కాటం రాజును, సత్యనారాయణను చికిత్స నిమిత్తం మంచిర్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇరువర్గాలు ఇచ్చిన ఫిర్యాదులను సేకరించి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

**జిల్లావ్యాప్తంగా ఫ్లెక్సీల లొల్లే**

మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్ నాయకుల ఫ్లెక్సీల లొల్లిలే దర్శనమిస్తున్నాయి. వీరి లొల్లిలను కట్టడి చేయడం పోలీసులకు కత్తి మీద సాముల తయారయిందని చెప్పవచ్చు. ముఖ్య నాయకులను కార్యకర్తలను అదుపు చేయడంలో అటు అధికార పార్టీ ఎమ్మెల్యేలు, ఇటు మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు విఫలమవుతున్నట్లు తెలుస్తోంది. పేద ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు కొరకు కృషి చేయవలసిన ఎమ్మెల్యే కింద స్థాయి నేతలు నేడు వాటిని మరిచి పలు రహదారుల ముఖ్య కుండలీలలో పెద్దపెద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తూ వాహనదారులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. అయ్యా ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీల్లారా మీతో తిరిగే వారి చరిత్ర, ఫ్లెక్సీలు పెట్టే వారి చరిత్ర గురించి, మీ భజన గ్యాంగ్ ల చరిత్రను తెలుసుకొని కట్టడి చేయాలని ప్రజలు కోరుతున్నారు. అలా కాని పక్షంలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వేటు పడక తప్పదని ప్రస్తుత ఎన్నికల పరిస్థితి గణంకాలు తెలుపుతున్నాయి జాగ్రత్త సుమా.

**మాజీ ఎమ్మెల్యే పరామర్శ**

కాంగ్రెస్ కార్యకర్తలు నాయకులు దాడిలో గాయపడ్డ వారిని మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. ఘర్షణకు దారి తీసిన అంశాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికార పార్టీ ఎమ్మెల్యే అండదండలతో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై దాడులు జరుగుతున్నాయని మండిపడ్డారు. ఇలాంటి దాడులు ప్రజాస్వామ్యానికి తగదని హితవు పలికారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించడం ప్రతిపక్షాల హక్కు అన్నారు.

## బిసి, రిజర్వేషనుకై రాజ్యాంగ సవరణ చేయాలి

**మంచిర్యాల, మహా :** బిసి, సంఘాల రిజర్వేషనుకై రాజ్యాంగ సవరణ చేయలని డిమాండ్ చేస్తూ బుధవారం మంచిర్యాల గాంధీ పార్క్ దగ్గర జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో నిరసన దీక్షను చేపట్టారు. ఈ సందర్భంగా బీసీ సంఘం నేత నేన్నల నర్సయ్య, మాట్లాడుతూ జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లు కల్పించాలని గత 40 సంవత్సరాల నుండి ఉద్యమాలు చేస్తున్నామని అన్నారు. ఈ నేపథ్యంలో ఉద్యమాలకు తలొగ్గిన రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానాలు చేసిందని వెల్లడించారు. 60 శాతం ఉన్నప్పటికీ బీసీలకు చట్టసభలలో 14 శాతం కూడా ప్రాతిరిధ్యం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీలో 1996, 2008, 2010, బీసీ రిజర్వేషన్లపై తీర్మానం చేశాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గుమ్ముల శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు గజెల్లి వెంకటయ్య, శాఖ పూరి భీమ్సేన్, చలిమెల అంజన్న, లంక సతీష్, కీర్తి రవి, కామ రాజకుమార్, గక్కల సంతోష్, రాచమల్ల రాజేశ్వరి, చంద్రగిరి చంద్రమౌళి చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.

## 15 నుండి 26 వరకు సదరం శిబిరాలు

**మంచిర్యాల జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్**

**మంచిర్యాల, మహా :** సెప్టెంబర్ 15 నుండి 26 వరకు సదరం శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మంచిర్యాల జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఈ నెల 15, 18, 22, 23 తేదీలలో లోకో మోటర్, 16వ తేదీన సికిల్ సెల్, 17, 24 తేదీలలో వినికిడి లోపం, 25వ తేదీన మానసిక ఆరోగ్యం/మేథో వైకల్యం, 26వ తేదీన తక్కువ దృష్టి/ దృష్టిలోపం సంబంధిత పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అర్హత గల దివ్యాంగులు శిబిరానికి హాజరు అవుటకు ముందు మీ సేవా కేంద్రాలలో స్లాట్ బుక్ చేసుకుని సంబంధిత పత్రాలతో ఆయా తేదీలలో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి సకాలంలో హాజరు కావాలని సూచించారు.

# విద్యార్థులను తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదే.!



**రంగారెడ్డి జిల్లా మహా:** విద్యార్థులకు మెరుగైన విద్యను అందించి భావి భారత పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదేనని చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. బుధవారం సమీకృత జిల్లా కార్యాలయంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాల ప్రధానోత్సవ కార్యక్రమానికి శాసన మండలి చీఫ్ వీప్ పట్నం మహేందర్ రెడ్డి ముఖ్య అతిధిగా పాల్గొని సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించి, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ... సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉపాధ్యాయుడుగా జీవితాన్ని ప్రారంభించి, దేశ అత్యున్నత స్థానమైన రాష్ట్రపతి పదవిని అలంకరించారని, ధాకృష్ణన్ ఆంధ్రా, బెనారస్ విశ్వవిద్యాలయాలకు వైస్ చాన్సలర్ గా కూడా పని చేశారని, సర్వేపల్లి రాధాకృష్ణన్ను గౌరవించి వారి జన్మదినాన్ని జాతీయ ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలిపారు. గ్రామీణ పేద విద్యార్థులను ఉన్నత శిఖరాలకు తీసుకువచ్చే బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదేనని అన్నారు. ఇబ్రహీంపట్నం శాసన సభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ... జిల్లాలో ఉత్తమ ఉపద్యాయులుగా 207 మందికి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాల ఇవ్వడం అభినందనీయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు పెద్ద పీట వేసిందన్నారు. సమాజంలో మార్పుకు ఉపాధ్యాయులే ముఖ్యమని, ఈ సందర్భంగా అందరికి అభినందనలు తెలిపారు. తల్లిదండ్రుల తరువాత స్థానం గురువులదే నని, అందరికీ మార్గదర్శకులు గురువులు అన్నారు.ఏ దేశ భవిష్యత్తు అయినా తరగతి గదిలోనే ఉంటుందన్నారు. ఒక ఇంజనీర్ ప్రాజెక్టులు నిర్మిస్తాడు, సైంటిస్ట్ రాకెట్లు తయారు చేస్తాడు, డాక్టర్ వైద్యం చేస్తాడు. కానీ వీరందరినీ తయారు చేసేది ఉపాధ్యాయులే అన్నారు. సమాజానికి ఉపయోగపడే విధంగా విద్యార్థులను తయారు చేసేది ఉపాధ్యాయులని, గురువుకు సమాజంలో అత్యుత్తమ స్థానం ఇవ్వడం జరిగిందని, సమాజ నిర్మాతలు, మార్గదర్శకులు ఉపాధ్యాయులేనని, విద్యార్థి జీవితాన్ని మలుపు తిప్పేది ఉపాధ్యాయులేనని అన్నారు. చేవెళ్ళ శాసన సభ్యులు కాలే యాదయ్య మాట్లాడుతూ... డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ ఉపాధ్యాయ వృత్తి నుండి రాష్ట్రపతి స్థాయి వరకు ఎదగడంలో ప్రత్యేకమైన స్థానం ఉపాధ్యాయులదేనని, మాడల్ స్కూల్స్ మరియు గురుకుల పాటశాలలు ప్రభుత్వం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రజా పాలన వచ్చిన తర్వాత ఉపాధ్యాయులకు ప్రమోషన్లు ఇవ్వడం జరిగిందన్నారు.

# సలాం... కరీమ్

**పేద పిల్లల కోసం మదర్సా నిర్వహణ**

ఉచిత విద్యతో పాటు మధ్యాహ్న భోజనం

70 మందికి తెలుగు, ఉర్దూ, అరబ్బీ, భాషల్లో శిక్షణ

అందరికి ఆదర్శం అన్వరే ముస్తఫా మదర్సా



**అమనగల్లు, మహా :** మదర్సా ఏర్పాటు చేసి నిరుపేద చిన్నారులకు ఉచితంగా విద్యతో పాటు భోజనం అందిస్తూ ఆదర్శంగా నిలిచాడు అన్వరే ముస్తఫా మదర్సా నిర్వాహకుడు మౌలానా అబ్దుల్ కరీం... కార్పొరేట్ చదువుల పేరుతో విద్యను,వ్యాపారంగా మార్చి నిలువు దోపిడికి గురి చేస్తూ విద్య విద్యాలయాలు అంటేనే హడాలిపోయే నేటి సమాజంలో తాను ఉన్నత విద్యను అభ్యసించి తనకున్న విద్య పరిజ్ఞానంతో పేద విద్యార్థులకు ఉచిత విద్యను అందిస్తు అందరికి ఆదర్శంగా నిలుస్తున్నాడు..సమాజ హితం కోరే ప్రతి ఒక్కరి జీవిత పరమార్థం వెనుక గురువు పాత్ర కీలకం. పుట్టిన ప్రతి చిన్నారికి ప్రథమ గురువు తల్లిదండ్రులు కాగ ఆ తరువాత స్థానం గురువులదే, ప్రతి వ్యక్తీ బాల్యం నుండి పెరిగి పెద్దయి ఉన్నత చదువులు చదివి ప్రయోజకుడిగా మారడంలో కీలక పాత్ర ఉపాధ్యాయులదేనని, దేశానికి రాజయిన గురువుకు శిష్యుడే అన్న చందంగా భావించిన ఆయన పేద పిల్లలను ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దేందుకు అహర్నిషలు కృషి చేస్తున్నారు. ధనార్జనే ధ్యేయంగా వ్యక్తులు ఉన్న నేటి సమాజంలోరెక్కాడితే డొక్కాడని తల్లిదండ్రులుతమ పిల్లలను చదివించుకోలేక హోటళ్లు, ఫంక్షన్ దుకాణాలు,పండ్లు,పంక్షర్ షాపులలో పనిచేయిస్తున్న చిన్నారులను చూసి చలించిన ఆయన వారిని ప్రయోజకులుగా తీర్చి దిద్దాలనే సంకల్పం విద్యతోనే అది సాధ్యం అన్ని భావించి పాఠశాల స్థాపనకు నడుంబిగించారు. తలకొండలపల్లి మండలం వెల్జాల్ గ్రామంలో మధ్యతరగతి కుటుంబంలో పుట్టిన మౌలానా అబ్దుల్ కరీం తాతల నుండి ముస్లిం పండితుల కుటుంబం కావడంతో చిన్నతనం నుండే సమాజానికి ఏదో ఒక రకంగా సేవ చేయాలనే తపనతో ఉన్న మౌలానా అబ్దుల్ కరీం మదర్సా ఏర్పాటు చేసి దాతల సహకారంతో విజయవంతం గా నిర్వహిస్తున్నాడు.. ప్రభుత్వ పరంగా మదర్సా నిర్వహణకు సహకారం అందిస్తే మరింత మంది పిల్లలకు విద్యను అందిస్తామని మౌలానా అబ్దుల్ కరీం అంటున్నాడు....

**5 మందితో మొదలై**

తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామంలో మధ్య తరగతి కుటుంబం పుట్టిన మౌలానా అబ్దుల్ కరీం 2013 జూన్ లో అమనగల్ పట్టణంలో ని అద్దె భవనంలో అన్వరే ముస్తఫా మదర్సా ను ప్రారంభించారు.. మదర్సా ను ప్రారంభించిన సమయంలో కేవలం 5 మంది పిల్లలతో ప్రారంభించగా నేడు70 మంది విద్యార్థులు ఉన్నారు.1 నుంచి7 తరగతులు మదర్సా లో నిర్వహిస్తూ ఉర్దూ ,తెలుగు,అరబ్బీ భాషలలో విద్యాబోధన అందిస్తున్నాడు.. ప్రభుత్వం ప్రోత్సాహం లేకున్నా దాతల సహకారంతో ఉచితంగా విద్యను అందించడమే కాక భోజనం కూడా అందిస్తున్నాడు... రోజు విద్యార్థులకు ఖురాన్ పై ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాడు.

**మదర్సా నిర్వాహకుడు అబ్దుల్ కరీం మాట్లాడుతూ***

ఉర్దూలో అలిమ్ అనే ఉన్నత విద్యను చదివిన తాను పట్టణంలో అన్వరే ముస్తఫా మదర్సా నిర్వహణకు ఆర్థిక ఇబ్బందులు ఉన్న కొనసాగిస్తున్నాను.. చదువుకు దూరమవుతున్న పేద చిన్నారులను చేరదీయడమే లక్ష్యం... దాతల సహకారంతో పుస్తకాలు, యూనిఫారాలు అందిస్తున్నాను.. కొంచెం భారంగా ఉన్న చిన్నారులకు మధ్యాహ్న భోజనం పెడుతున్నాను. పాఠశాలకు నిర్వహణకు నెలకు20 నుంచి 30 వేల రూపాయల ఖర్చు వస్తుందని,ఎక్కడైనా వారాంలో ఒకరోజు పనిచేసిన డబ్బులు సంపాదించవచ్చునని ,పేద పిల్లలకు సేవ చేయడంలో ఉన్న తృప్తి అందులో లేదన్నారు..ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తే మరింత మంది పేద పిల్లలకు విద్యను అందిస్తూ సేవ చేయడానికి తాను సిద్ధంగా ఉన్నానని ఆయన చెప్పారు.



## గొప్ప సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ

**సిపిఐ మండల కార్యదర్శి కావలి సురేష్**

**రంగారెడ్డి జిల్లా మహా:** భూమికోసం, భుక్తి కోసం, రైతుల కోసం పోరాటం చేసిన యోధురాలు ఐలమ్మ అని అన్నారు. ఇబ్రహీంపట్నం భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో, బుధవారం చాకలి ఐలమ్మ 40వ వర్ధంతి సందర్భంగా, ఇబ్రహీంపట్నంలో ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి కావలి సురేష్ మాట్లాడుతూ... తెలంగాణ సాయుధ పోరాటం నిర్వహించడంలో చాకలి ఐలమ్మ ముఖ్య పాత్ర పోషించిందని కొనియాడారు. ఆమె భూమికోసం, భుక్తి కోసం, రైతుల కోసం చేసిన త్యాగాని గుర్తు చేస్తూ, ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు.. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యురాలు పోచమోని నీలమ్మ, సహాయ కార్యదర్శి జంగిల్ ప్రవీణ్ కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు శివరా లక్ష్మయ్య, మొలుగు నరసింహ, జంగిలి నరసింహ, శీను, విజయ్ కుమార్, జంగయ్య, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలు




**ఆమనగల్లు, మహా:** చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలు ఆమనగల్లు, కడ్తాల్ మండలంలోని రజక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ సాయుధ పోరాటం రజాకార్ల ఉద్యమం, భూస్వామ్య పెత్తందారుల విధానాలకు విరోచితంగా పోరాటాలు చేసిన ఘనత చాకలి ఐలమ్మదని కొనియాడారు.ఈ కార్యక్రమంలో రజక సంఘము,పలు పార్టీల నాయకులు,పాల్గొన్నారు.

# కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ని సందర్శించిన డీసీ, సురేందర్ రెడ్డి



**రాజేంద్రనగర్, మహా ;** మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ని బుధవారం డిప్యూటీ కమిషనర్ సురేందర్ రెడ్డి సందర్శించారు. ఇండోర్ స్టేడియంలో కావలసిన వసతులపై ఇన్చార్జ్ అధికారి శ్రీకాంత్,క్రీడాకారులతో చర్చించారు. యోగా కేంద్రానికి నూతనంగా షెడ్డు ఏర్పాటు చేయాలని వివేకానంద యోగా సమితి అధ్యక్షులు యోగా గురువు భద్రయ్య డీసీ దృష్టికి తీసుకెళ్లారు. కిక్ బాక్సింగ్ కి, యోగా కేంద్రాలకు నూతన గదులను కేటాయిస్తామన్నారు. ఇండోర్ స్టేడియంలో క్రీడాకారులకు మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేస్తామన్నారు. కావలసిన వసతులను త్వరలో ఏర్పాటు చేస్తామని తెలిపారు. జిహెచ్ఎంసి ఆన్లైన్ ఆప్ లో చేరి రుసుము చెల్లించి క్రీడాకారులు వినియోగించుకోవాలి. కార్యక్రమంలో కిక్ బాక్సింగ్ కోచ్ నర్సింగ్ రావు, యోగ గురు వేంటేష్ రావు,సురేష్ గుప్తా,ఎల్లప్ప, కిష్ట,నరసింహగుప్తా,పాండు. వాకర్ అసోసియేషన్ సభ్యులు ప్రసాద్ శర్మ, శ్రీశైలం, నరసింహారాజు, నరేందర్, సుదామ, బీకేసింగ్, శేఖర్, శ్రీనివాస్, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీలో సిబ్బంది కొరత




**ఆమనగల్లు, మహా :** ఆమనగల్లు మున్సిపాలిటీలో సిబ్బంది కొరత వేధిస్తోంది.సిబ్బంది లేక ప్రజలకు సేవలు సరిగా అందడం లేదు. అధికారుల పర్యవేక్షణ, వివిధ శాఖలకు సిబ్బంది లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మున్సిపా లిటీలో చాలా పోస్టులు ఖాళీగా ఉన్నాయి.కార్యాలయంలో ముఖ్యమైన విభాగా ల్లో కీలకమైన పోస్టులు ఖాళీగా ఉండడంతో సరైన విధంగా సేవలు అందించడం లేదని ప్రజలు వాపోతున్నారు. కార్యాలయంలో మొత్తం మంజూరైన పోస్టులు 23 కాగా 19 పోస్టులతో మాత్రమే కొనసాగుతుంది. ఆ 19 మంది అధికారుల్లో ప్రస్తుతం ఆరుగురు అధికారులు మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్, జూనియర్ అసిస్టెంట్ అఫ్రోజ్, జూనియర్ అకౌంటెంట్ ఉపేందర్ రెడ్డి, వార్డు ఆఫీసర్ కలిపి మొత్తం నలుగురు మాత్రమే రెగ్యులర్ అధికారులు పనిచేస్తున్నారు.ఎఈ శ్రీనివాస్ పెద్ద అంబర్పేట్, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ వరప్రసాద్ ఆదిభట్ల వడ్డేపల్లితో పాటు అమనగల్లు ఇన్చార్జిగా ఉండడంతో వారానికి రెండుసార్లు మాత్రమే విధులకుహాజరవుతున్నారు. రెగ్యులర్ పోస్టుల్లో సిబ్బంది లేక మేనేజరు సానిటరీ ఇన్ స్పెక్టర్ పోస్టుల్లో ఇన్ చార్జిగా పనిచేస్తున్నారు. రెగ్యులర్ మేనేజరు ఘట్కేసర్ డిప్యూటేషన్లో ఉన్నారు. మున్సిపల్ కార్యాలయంలో సరైన సిబ్బంది లేక ప్రజల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.మున్సిపాలిటీ ఏర్పడినప్పటి నుంచి లేదా పట్టణ జనాభా పెరుగుతున్నప్పటికీ, సిబ్బందిని నియామకం చేయకపోవడం,ఉన్న కొద్దిమంది సిబ్బందిపై పనుల భారం పెరిగి, వారు ఇబ్బందులు పడతున్నారు. ఆమనగల్లు మున్సిపల్ కార్యాలయంలో ప్రజల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వం వెంటనే పోస్టులను మంజూరు చేసి పూర్తి స్థాయి అధికారులను నియమించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు

# గ్రామపంచాయతీల అభివృద్ధికి సొంత ఆదాయ వనరులు కీలకం



**ఆమనగల్లు, మహా:** గ్రామపంచాయతీల అభివృద్ధి సొంత ఆదాయ వనరులపై ఆధారపడి ఉంటుందని సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి అన్నారు.జాతీయ గ్రామీణాభివృద్ధి మరియు పంచాయతీరాజ్ శాఖ,రాజేంద్రనగర్ ఆధ్వర్యంలో ఎస్.కె రావ్ ఆడిటోరియంలో 19 రాష్ట్రాలకు చెందిన స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ పంచాయతీరాజ్ సీనియర్ కన్సల్టెంట్స్ తో ఏర్పాటు చేసిన కాన్ఫరెన్స్ లో లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి పాల్గొన్నట్లు తెలిపారు. తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం 2018 ద్వారా గ్రామపంచాయతీకి ఉన్న వివిధ అధికారాలు, వినియోగాల గురించి వివరించినట్లు తెలిపారు. గ్రామపంచాయతీ ద్వారా సొంత ఆదాయ వనరుల పెంపులో భాగంగా ఇంటి పన్ను ,వినోదపు పన్ను,వారాంతపు సంత,వృత్తి వ్యాపార లైసెన్సుల మంజూరి ద్వారా వచ్చే వివిధ ఆదాయ వనరుల వివరాలు మరియు పన్నుల వసూలుకు తీసుకున్న జాగ్రత్తల గురించి వివరించినట్లు తెలిపారు.ఈ సమావేశంలో వివిధ రాష్ట్రాలకు చెందిన 64 మంది సీనియర్ కన్సల్టెంట్లు పాల్గొన్నట్లు తెలిపారు. గ్రామ పంచాయతీల అభివృద్ధిలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల నిధుల భాగస్వామ్యంతో పాటు సొంత ఆదాయ వనరుల కూర్పు కూడా చాలా ముఖ్యమన్నారు. గ్రామపంచాయతీల అభివృద్ధి పాలకవర్గం సమిష్టి కృషి, ప్రజల భాగస్వామ్యంతోనే సాధ్యమన్నారు.తెలంగాణలో తాజా మాజీ సర్పంచులు చేసిన అభివృద్ధికి దేశ వ్యాప్తంగా గుర్తింపు లభించిందని తదనుగుణంగానే రాష్ట్రానికి ఎన్నో జాతీయ స్థాయిలో ఉత్తమ అవార్డులు అందాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో కార్యక్రమ నిర్వాహకులు ప్రొఫెసర్లు దిలీప్ కుమార్ పాల్, అంజన్ కుమార్ బాంజియా,అన్నా దొరై,అజిత్ కుమార్, ఆశాలత,ఉపేందర్, శ్రీనగర్,జమ్మూకాశ్మీర్, జార్ఖండ్,ఉత్తరప్రదేశ్, తమిళనాడు,చత్తీస్గఢ్ వివిధ రాష్ట్రాల కన్సల్టెంట్లు పాల్గోన్నారు.

## భూమికోసం భుక్తికోసం పోరాడిన వీరవనిత చాకలి ఐలమ్మ ఘన నివాళులు



**రాజేంద్రనగర్, మహా ;** శంషాబాద్ మండలం పెద్దతూప్పరా గ్రామంలో రజక సంఘం ఆధ్వర్యంలో వీరవనిత చాకలి ఐలమ్మ 40వ వర్ధంతి సందర్భంగా మాజీ ఎంపీపీ జయమ్మ శ్రీనివాస్ ఆమె విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. మాజీ ఎంపీపీ మాట్లాడుతూ భూమికోసం, భుక్తికోసం వెట్టిచాకిరి విముక్తి కోసం ఐలమ్మ చేసిన పోరాటం ప్రతి మహిళకు స్ఫూర్తి దాయకమన్నారు. కార్యక్రమంల రాజు, అంజయ్య, గౌతమ్, నరేష్, శేఖర్, కుమార్, ఎన్ చెన్నకేశవ్, మహేష్, రాములు,ఎండి ఆజం, ఆంజనేయులు, నారాయణ, సిద్ధార్థ్, మహిపాల్, విష్ణుచైతన్య, సాయిబాబా, వంశీ, రమేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# చాకలి ఐలమ్మ అందరికీ స్ఫూర్తి...

**ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, వీర్లపల్లి శంకర్**




**రాజేంద్రనగర్, మహా ;** రాజేంద్రనగర్ నగర్ సర్కిల్ పరిధిలోని అత్తాపూర్ తాళ్లకుంట వద్ద వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా శ్రీరామ వాషర్ మెన్ కోఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం రజక భవన్ ను ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తో కలిసి బుధవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ తాళ్లకుంట ఒడ్డున రజకులకు ప్రభుత్వం కేటాయించిన ఐదెకరాల భూమి పూర్తిగా రజకుల ప్రయోజనాల కోసమే ఉపయోగించేలా చర్యలు తీసుకుంటున్నట్టు వెల్లడించారు. కుంట పోను మిగిలిన రెండు ఎకరాల స్థలంలో రజకులలో నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి కల్పించడానికి ఆధునిక తరహా సౌకర్యాలను ఏర్పాటు చేస్తామన్నారు. సామాజికంగా , ఆర్థికంగా అణగారిన రజకులకు ప్రభుత్వ సహాయం అందిస్తుంది. నిరంతరం శ్రమిస్తూ ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ భూమికోసం భుక్తి కోసం, దొరలు, నిజాం నవాబుల బానిస సంకెళ్ల నుంచి విముక్తి కోసం తెగించి పోరాడిన చాకలి ఐలమ్మ ను నేటి సమాజం స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అత్తాపూర్ కార్పొరేటర్ సంగీత, నర్సింగ్ రావు అభివృద్ధి సంస్థ అధ్యక్షులు బి కృష్ణమూర్తి, ఉపాధ్యక్షులు కొండమీది హరినాథ్, శ్రీరామ వాషర్మెంట్ కోఆపరేటివ్ సొసైటీ నాయకులు అశోక్, శంకర్, సుధాకర్, ఎర్ర మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## శంషాబాద్ ఎయిర్ పోర్ట్ లో విదేశీ జంతువుల పట్టివేత



**రాజేంద్రనగర్, మహా ;** శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో బ్యాంకాక్ నుంచి వస్తున్న ఇద్దరు ప్రయాణికుల వద్ద విదేశీ జంతువులను ఎయిర్ పోర్ట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం సతీష్‌బాబు, కన్నప్ప అనే ఇద్దరు ప్రయాణికులు ఈనెల 8వ తేదీన బ్యాంకాక్ నుంచి శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్నారు. ఇద్దరు ప్రయాణికుల కదలికలో అనుమానం కలగడంతో ఏర్పోర్ట్ అధికారులు లగేజ్ ని క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. వారి లగేజీలో విదేశీ జంతువులు సరీసృపాల జాతికి చెందిన పలు జంతువులను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు ఇద్దరిని అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. సంఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగుచూసింది.

## జీవో 60 ప్రకారం వేతనాలు చెల్లించిన మున్సిపల్ కమిషనర్ వెంకటేశం



**రంగారెడ్డి జిల్లా మహా:** తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు చేవెళ్ల పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులకు జీవో 60 ప్రకారం వేతనాలు చెల్లించినందుకు చేవెళ్ల మున్సిపల్ కమిషనర్ ను శాలువాతో సత్కరించడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ మాట్లాడుతూ... చేవెళ్ల మున్సిపల్ యూనియన్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులకు జీవో 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని అనేక దఫాలుగా స్థానిక పురపాలక సంఘం కార్యాలయం ముందు ఆందోళనలు, పోరాటాలు నిర్వహించడం జరిగిందని గుర్తు చేశారు. ప్రస్తుత కమిషనర్ వెంకటేశం వచ్చిన అతి తక్కువ కాలంలోనే మున్సిపల్ కార్మికులకు జీవో 60 ప్రకారం వేతనాలు చెల్లించినందుకు హర్షం వ్యక్తం చేస్తూ యూనియన్ ఆధ్వర్యంలో కృతజ్ఞతలు తెలపడం జరిగింది. భవిష్యత్తులో కూడా కార్మికుల హక్కుల కోసం కమిషనర్ నిలబడాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ చేవెళ్ల అధ్యక్ష కార్యదర్శులు గంగారం నరేష్, సిహెచ్ నరేష్ ఉపాధ్యక్షులు దస్తగిరి జనార్ధన్ వెంకటయ్య నరసింహులు తదితరులు పాల్గొన్నారు

# తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వీరవనిత చాకలి ఐలమ్మ

**జిల్లా రెవెన్యూ అధికారి సంగీత**



**రంగారెడ్డి జిల్లా మహా:** భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం జరిగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి స్ఫూర్తినిచ్చిన వీరవనిత చాకలి ఐలమ్మ అని జిల్లా రెవెన్యూ అధికారి సంగీత అన్నారు. మంగళవారం వీరనారి చాకలి ఐలమ్మ 40వ వర్ధంతి సందర్భంగా, సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ కార్యాలయంలో, బీసీ వెల్ఫేర్ ఆధ్వర్యంలో నిర్వహించిన చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమంలో, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత ముఖ్య అతిధిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి, చాకలి ఐలమ్మ చిత్రపటానికిపూలమాలవేసిఘనంగానివాళులర్పించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ... తెలంగాణ రైతాంగ పోరాటంలో వీరవనితగా గుర్తింపు పొందిన ఐలమ్మ క్రిష్టాపురం గ్రామం, రాయపర్తి మండలం, వరంగల్ జిల్లాలో జన్మించిందని అన్నారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం జరిగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి స్ఫూర్తినిచ్చిన వీరవనిత చాకలి ఐలమ్మ అని అన్నారు. ఈ భూమినాది, పండించిన పంటనాది, తీసుకెళ్లడానికి దొరెవ్వడు, నా ప్రాణం పోయాకే ఈ పంట, భూమి మీరు దక్కించుకోగలరు, అంటూ మాటల్ని తూటాలుగా మల్చుకొని దొరల గుండెల్లో బడబాగ్నిలా రగిలిన తెలంగాణ రైతాంగ విప్లవాగ్ని చాకలి ఐలమ్మ అని అన్నారు. 194044 మధ్య కాలంలో విస్నూర్ లో దేశ్ ముఖ్, రజాకర్ల అరాచకాల పై ఎదురు తిరిగి ఎర్రజెండా పట్టిందని తెలిపారు. ప్రజా పోరాటాలకు స్ఫూర్తిగా నిలిచిన ఐలమ్మ 10 సెప్టెంబర్ 1985న అనారోగ్యంతో మరణించిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ అధికారి కేషురామ్, వివిధ సంఘాల ప్రతినిధులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా మహా సభలను జయప్రదం చేయాలి

**ఆమనగల్లు బ్లాక్ అధ్యక్షులు దరువుల శంకర్.. ఆమనగల్లు జిల్లా మహా సభల కరపత్రం ఆవిష్కరణ**



**ఆమనగల్లు, మహా:** టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా 3వ మహా సభలను జయప్రదం చేయాలని టీడబ్ల్యూజేఎఫ్ ఆమనగల్లు బ్లాక్ అధ్యక్షులు దరువుల శంకర్ అన్నారు. బుధవారం ఆమనగల్లు మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో టీడబ్ల్యూజేఎఫ్ నాయకులు జిల్లా మహా సభల కర పత్రాలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా బ్లాక్ అధ్యక్షులు దరువుల శంకర్ మాట్లాడుతూ జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే లక్ష్యంగా టీడబ్ల్యూజే ఫెడరేషన్ ముందుకు సాగుతుందని అన్నారు. ఈనెల 26వ తేదీన కందుకూరు మండల కేంద్రములోని శుభం గార్డెన్ లో శుక్రవారం ఉదయం ప్రారంభమైయ్యే సమావేశంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టు సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర నాయకులు మస్న ఆనంద్, జిల్లా నాయకులు కోట్ల వెంకటేష్, ఆమనగల్లు బ్లాక్ అధ్యక్షులు దరువుల శంకర్, గౌరవ అధ్యక్షులు రాచాలపల్లి నర్సింహ, సమన్వయ కమిటీ అధ్యక్షులు యూనుస్, నాయకులు చప్పిడి తిరుపతి, తూర్పు శ్రీను, ఇమ్రాన్, రాజు, గిరి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

### శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో

# 13.9 కేజీల గంజాయి పట్టివేత



**రాజేంద్రనగర్, మహా ;** శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఎయిర్ పోర్ట్ అధికారులు బ్యాంకాక్ నుంచి వస్తున్న ఓ ప్రయాణికుని వద్ద 14 కోట్ల విలువైన గంజాయి (హైడ్రోపోనిక్ వీడ్) ని పట్టుకున్నారు. హైదరాబాద్ నగరానికి చెందిన సయ్యద్ రిజ్వి బ్యాంకాక్ నుండి శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి వస్తు తన లగేజీలో 13.9 గంజాయి తన లగేజ్ లో దాచి తీసుకువస్తుండగా ఎయిర్ పోర్ట్ అధికారులు అతని కదలికలలో అనుమానం రావడంతో అతని అదుపులోకి తీసుకొని లగేజీని క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. తనిఖీలలో అతని వద్ద ఉన్న 14 కోట్లు విలువ చేసే 13.9 కేజీల గంజాయి (హైడ్రోఫోనిక్ వీడ్) పట్టుబడింది. ఎయిర్పోర్ట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రభుత్వ సెక్యూరిటీల వేలం



రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) తాజాగా రాష్ట్ర ప్రభుత్వ సెక్యూరిటీల వేలం ద్వారా రూ.14,900 కోట్లు సమీకరించింది. వివిధ విడతలతో కూడిన ఈ వేలంలో ఆరు రాష్ట్రాలు తమ ఆర్థిక అవసరాల కోసం గణనీయమైన నిధులను సమకూర్చుకున్నాయి. ఆర్‌బీఐ అధికారిక ప్రకటన ప్రకారం.. వివిధ మెచ్యూరిటీల ద్వారా మొత్తం రూ.15,300 కోట్లు ఆఫర్ చేసింది. కానీ చివరకు రూ.14,900 కోట్లు అందించింది. ఆర్‌బీఐ రుణాలు ఇచ్చిన ఆరు రాష్ట్రాల వివరాలు కింది విధంగా ఉన్నాయి. ఈ సెక్యూరిటీల వేలంలో బిహార్ అతిపెద్ద రుణగ్రహీతగా ఉంది. మూడు వేర్వేరు విడతల ద్వారా రూ.6,000 కోట్లు సేకరించింది. 5, 9 మరియు 11 సంవత్సరాల కాలపరిమితితో సెక్యూరిటీల ద్వారా రాష్ట్రం రూ.2,000 కోట్ల చొప్పున నిధులు సమీకరించింది. గోవా.. 11 సంవత్సరాల సెక్యూరిటీ ద్వారా 7.48% ఈల్డ్‌తో రూ.100 కోట్ల రూపాయలను సేకరించింది. హరియాణా రూ.1,500 కోట్లు, జమ్మూ కశ్మీర్ 7.51% ఈల్డ్ అందించే 20 సంవత్సరాల బాండ్‌తో రూ.300 కోట్లు సమీకరించింది. మధ్య ప్రదేశ్ మూడు వేర్వేరు విడతల ద్వారా రూ. 4,000 కోట్లు సేకరించింది. మహారాష్ట్ర మూడు మెచ్యూరిటీలలో రూ.3,000 కోట్లు అప్పుగా తీసుకుంది.

# ఇన్ఫోసిస్ వచ్చేస్తోంది.. క్యాంపస్ ఉద్యోగాల జాతరకు సిద్ధం

దేశీయ రెండో అతిపెద్ద ఐటీ సంస్థ ఇన్ఫోసిస్ క్యాంపస్ నియామకాలకు సన్నద్ధమవుతోంది. దాదాపు రెండేళ్ల తర్వాత కాలేజీ క్యాంపస్‌లకు వచ్చి విద్యార్థులను ఉద్యోగాల్లో నియమించుకోబోతోంది. ఈ మేరకు రిక్రూట్‌మెంట్‌కు సంబంధించిన ప్యానెల్ ఇంటర్వ్యూలలో పాల్గొనాలని తమ సీనియర్ సిబ్బందిని ఇన్ఫోసిస్ కోరింది. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, ఇన్ఫోసిస్, విప్రోతో సహా ప్రధాన ఐటీ కంపెనీలు కోవిడ్ కారణంగా క్యాంపస్, లేటరల్ రిక్రూట్మెంట్లను తగ్గించాయి. ఇన్ఫోసిస్ అయితే ఫ్రెషర్ రిక్రూట్‌మెంట్‌లను బాగా తగ్గించేసింది. 2024 ఆర్థిక సంవత్సరంలో 11,900 మందిని మాత్రమే నియమించుకుంది. అంతకుముందు సంవత్సరంలో నియామకాల సంఖ్య 50,000తో పోల్చితే ఇది చాలా తక్కువ. ఈ సంఖ్య 2025 ఆర్థిక సంవత్సరంలో 15,000 కు పెరిగింది. బెంగళూరుకు చెందిన ఐటీ సంస్థ మార్చి 2026తో ముగిసే ఆర్థిక సంవత్సరానికి కంబైన్డ్ ఆఫ్, ఆన్‌క్యాంపస్ కార్యక్రమాల ద్వారా 15,00020,000 కొత్త నియామకాల లక్ష్యాన్ని పెట్టుకుంది. డిజిటల్ స్పెషలిస్ట్ ఇంజనీర్ల (డీఎస్ఈ) పేరుతో ఫ్రెషర్లను ఇన్ఫోసిస్ ఎంపిక చేయబోతోంది. క్యాంపస్ ఇంటర్వ్యూల గురించి ఇన్ఫోసిస్ తొలిసారిగా మేనేజర్ స్థాయి అంతకంటే ఎక్కువ హోదా ఉన్న ఉద్యోగులకు మాస్ ఈ మెయిల్ కమ్యూనికేషన్ పంపింది. దీని ప్రకారం.. ఇన్ఫోసిస్ ప్రతినిధులు అభ్యర్థుల ప్రాథమిక ప్రోగ్రామింగ్ సామర్థ్యాలను, ఎంట్రీ లెవల్ డీఎస్ఈ స్థానాలకు అవసరమైన సమస్య పరిష్కార సామర్థ్యాలను అంచనా వేస్తారు. ఇన్ఫోసిస్ క్యాంపస్ నియామాలు వచ్చే అక్టోబర్, నవంబర్ చివరి మధ్య షెడ్యూల్ చేసినట్లు తెలుస్తోంది. గతంలో కోవిడ్ మహమ్మారి సమయంలో కంపెనీ వర్చువల్ ఇంటర్వ్యూలను నిర్వహించింది.




# ప్రత్యేక కళాకృతుల ప్రదర్శన.. ఎప్పుడంటే..





ప్రత్యేకమైన కళాకృతులు, ఆభరణాలు, కళలకు సంబంధించి అత్యాధునిక డిజైన్లను అందించే ఆర్ట్ కనెక్ట్, ఎ అండ్ హెచ్ కొలాబ్ సంస్థ సంయుక్తంగా హైదరాబాద్ వేదికగా తమ ఉత్పత్తులను ప్రదర్శించనున్నట్లు తెలిపాయి. సెప్టెంబర్ 15న హైదరాబాద్‌లోని రామానాయుడు స్టూడియోస్ సమీపంలో స్పిరిట్ కనెక్ట్‌లో ఈమేరకు ప్రదర్శన ఉంటుందని కంపెనీ ప్రతినిధులు ప్రకటన విడుదల చేశారు. ఆర్ట్ కనెక్ట్ కంపెనీని ప్రముఖ నటుడు రానా దగ్గుబాటి భార్య మిహీకా బాజాజ్ దగ్గుబాటి స్థాపించారు. ఏ అండ్ హెచ్ కోలాబ్ వ్యవస్థాపకులుగా అమృతా కిలాచంద్, హీనా ఓమర్ అహ్మద్ ఉన్నారు. ఈ ప్రదర్శన ప్రధానంగా ల్యామ్, వ్యానా అనే థీమ్‌లతో సాగుతుందని నిర్వాహకులు చెప్పారు. ఇందులో ప్రత్యేక ఆకృతులు, ఆభరణాలు, డిజైనింగ్ వస్తువులు..వంటివి ప్రదర్శనకు ఉంచబోతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మిహీకా బజాజ్ దగ్గుబాటి మాట్లాడుతూ..'ఆర్ట్ కనెక్ట్ కళాకృతులు, కళాకారులు, వినియోగదారుల మధ్య బంధాన్ని బలోపేతం చేసేందుకు ప్రయత్నిస్తోంది. యూజర్లలో పెరుగుతున్న డిజైన్ స్పృహకు హైదరాబాద్ ప్రసిద్ధి చెందింది. ఇది ఏ అండ్ హెచ్ కొలాబ్ సహకారంతో రూపొందించిన మా ప్రారంభ ఎడిషన్' అన్నారు. ఏ అండ్ హెచ్ కొలాబ్ వ్యవస్థాపకులు అమృతా కిలాచంద్, హీనా ఓమర్ అహ్మద్ మాట్లాడుతూ..'ఈ ప్రదర్శన కోసం ఆర్ట్ కనెక్ట్‌తో కలిసి ప్రేక్షకులను ఆకర్షించేందుకు ప్రయత్నిస్తున్నాం. అందుకు కళాకృతుల్లో కళను, డిజైన్‌ను మిళితం చేస్తున్నాం' అన్నారు.

# ఐటీ, బ్యాంక్ షేర్ల ర్యాలీ..

## లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు



బెంచ్ మార్క్ ఇండియన్ ఈక్విటీ సూచీలు బుధవారం సానుకూల నోట్‌లో ముగిశాయి. ఐటీ, ప్రభుత్వ రంగ బ్యాంక్ స్టాక్స్ లో ర్యాలీతో లాభాల్లో స్థిరపడ్డాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 323.83 పాయింట్లు లేదా 0.40 శాతం లాభంతో 81,425.15 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 104.50 పాయింట్లు లేదా 0.42 శాతం పెరిగి 24,973.10 వద్ద ముగిసింది. భారత్ ఎలక్ట్రానిక్స్, హెచ్‌సీఎల్ టెక్, బజాజ్ ఫైనాన్స్, యాక్సిస్ బ్యాంక్, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ 4.50 శాతం లాభపడ్డాయి. మరోవైపు మహీంద్రా అండ్ మహీంద్రా, మారుతి సుజుకి, టాటా మోటార్స్, అల్ట్రాటెక్ సిమెంట్, ఎటర్నల్ షేర్లు 2.46 శాతం వరకు పడిపోయాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ 100, నిఫ్టీ స్మాల్ క్యాప్ 100 సూచీలు వరుసగా 0.83 శాతం, 0.73 శాతం లాభంతో స్థిరపడ్డాయి. నిఫ్టీ ఐటీ, పీఎస్‌యూ బ్యాంక్ సూచీలు వరుసగా 2.63 శాతం, 2.09 శాతం లాభంతో స్థిరపడ్డాయి. ఎంఆర్ఎఫ్, మహీంద్రా అండ్ మహీంద్రా, టీవీఎస్ మోటార్ కంపెనీ నిఫ్టీ ఆటో ఇండెక్స్ 1.28 శాతం నష్టంతో స్థిరపడింది. మార్కెట్ విస్తృతి సానుకూలంగా ఉంది. ఎందుకంటే ఎన్ఎస్ఈలో 3,128 ట్రేడెడ్ స్టాక్స్ లో 1,835 గ్రీన్‌లో ముగిశాయి. 1,210 రెడ్‌లో ముగిశాయి. మరోవైపు 83 షేర్లలో మార్పులేదు. ఎన్ఎస్ఈలో లిస్టెడ్ స్టాక్స్ మార్కెట్ క్యాపిటలైజేషన్ 5.14 ట్రిలియన్ డాలర్లుగా ఉంది.

# బ్యాంక్ ఆఫ్ బరోడాలో ప్రత్యేక అకౌంట్.. ఎవరి కోసమంటే..





ప్రభుత్వ రంగ బ్యాంక్ ఆఫ్ బరోడా కొత్తగా 'బీఓబీ యాస్పైర్ ఎన్ఆర్ఐ సేవింగ్స్ అకౌంట్' ప్రవేశపెట్టింది. విదేశాలకు వెళ్లే ముందు, భారత్‌లోనే ఉన్నప్పుడే కస్టమర్లు బీఓబీ యాస్పైర్ ఎన్ఆర్ఈ సేవింగ్స్ అకౌంటు తెరవాలి. ఇలా తెరిచిన ఖాతా, తొలుత 'ఇనాక్టివ్ మోడ్'లో ఉంటుంది. ఖాతాదారులు తమ ఎన్నారై హోదాను ధృవీకరిస్తూ ఇమ్మిగ్రేషన్ స్టాంపుతో పాస్‌పోర్ట్ కాపీ, విదేశాల్లోని చిరునామా ధృవీకరణ పత్రాన్ని సమర్పించిన తర్వాత ఖాతా పూర్తి స్థాయిలో యాక్టివ్‌గా మారుతుంది. ఈ అకౌంటుపై తొలి రెండు త్రైమాసికాల్లో ఎలాంటి కనీస బ్యాలెన్స్ చార్జీలు ఉండవు. తదుపరి ప్రతి క్వార్టర్‌కు సగటున రూ.1,000 బ్యాలెన్స్ నిబంధన వర్తిస్తుంది. అకౌంటు బ్యాలెన్స్‌లో గరిష్ట పరిమితేమీ ఉండదు. ఖాతాపై వచ్చిన ఆదాయానికి, ఇన్‌కం టాక్స్ నుంచి, బ్యాలెన్స్‌లకు వెల్త్ ట్యాక్స్ నుంచి మినహాయింపు ఉంటుంది. ఎయిర్‌పోర్ట్ లాంజ్ ఫెసిలిటీతో పాటు మరెన్నో ప్రయోజనాలు అందించేలా కస్టమైజ్ చేసిన డెబిట్ కార్డు ఉంటుంది. భావి ప్రవాస భారతీయుల (ఎన్నారై) అవసరాలకు అనుగుణంగా 'బీఓబీ యాస్పైర్ అకౌంట్'ను ప్రవేశపెట్టామని బ్యాంకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బీనా వహీద్ తెలిపారు.

## దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL

# రాజ్యాంగాన్ని తిరగ రాస్తేనే శాంతిస్తాం..

## నేపాల్ యువత డిమాండ్లు ఇవిగో!





నేపాల్‌లో యువత (Gen Z) చేపట్టిన ఆందోళనలు దేశ రాజకీయాలను శాసించాయి. నిరసనలు హింసాత్మక మలుపు తిరగడం, ఆర్మీ రంగంలోకి దిగినా పరిస్థితి అదుపు రాకపోవడం, పైపెచ్చు నేతలు.. వాళ్ల ఆస్తులపై దాడులతో పరిస్థితి మరింత విషమించింది. ఈ దెబ్బకు.. కేపీ శర్మ ఓలి నేతృత్వంలోని ప్రభుత్వం రాజీనామా చేయాల్సి వచ్చింది. అయితే.. రాజకీయ సంక్షోభం దరిమిలా నేపాల్ సైన్యం రంగంలోకి దిగింది. విధ్వంసాలను ఉపేక్షించేది లేదని హెచ్చరించింది. నేపాల్ ఆర్మీ చీఫ్ జనరల్ అశోక్ రాజ్ సిగ్దెల్ జాతిని ఉద్దేశిస్తూ గత అర్ధరాత్రి ప్రసంగించారు. ప్రస్తుత సంక్షోభాన్ని శాంతియుతంగా పరిష్కరించేందుకు చర్చలే మార్గమని అన్నారాయన. అదే సమయంలో విధ్వంసం, దాడులు, దోపిడీ వంటి చర్యలు కొనసాగితే.. ఆర్మీ కఠినంగా స్పందిస్తుంది అని ప్రకటించారు. ఆర్మీ ఇప్పటికే కీలక ప్రాంతాలను నియంత్రణలోకి తీసుకుంది. ట్రిభువన్ అంతర్జాతీయ విమానాశ్రయం, సింగదుర్బార్, పార్లమెంట్ భవనం వంటి ప్రదేశాల్లో సైనికులు మోహరించారు. గత రాత్రి 10 గంటల నుంచి దేశవ్యాప్తంగా కర్ఫ్యూ అమలులోకి వచ్చింది. అయితే.. ఇది కేవలం సోషల్ మీడియా నిషేధంపై స్పందన కాదని యువత అంటోంది. గత మూడు దశాబ్దాలుగా రాజకీయ నాయకులు దోచుకున్న ఆస్తులపై విచారణ జరిపించాలని అంటోంది. అలాగే.. రాజ్యాంగాన్ని తిరగరాసి పాలనలో విస్తృత సంస్కరణలు చేపట్టాలని అంటోంది. ఈ క్రమంలో.. ఉద్యమ నిర్వాహకులు తమ కీలక డిమాండ్లు ప్రకటించారు. అందులో..

- నిరసనల్లో ప్రాణాలు కోల్పోయిన వారిని అధికారికంగా అమరులుగా గుర్తించడం
- వారి కుటుంబాలకు రాష్ట్ర గౌరవం, గుర్తింపు & ఆర్థిక సహాయం అందించడం
- నిరుద్యోగం, వలస, సామాజిక అన్యాయంపై ప్రత్యేక కార్యక్రమాలు
- కొత్త రాజకీయ వ్యవస్థ స్థాపనకు పిలుపు

ఈ ఉద్యమం ఏ పార్టీకి లేదంటో వ్యక్తికి చెందింది కాదు. ఇది ఒక తరం కోసం.. దేశ భవిష్యత్తు కోసమే అని పేర్కొంది. శాంతి అవసరమే అని, కానీ, అది కొత్త రాజకీయ వ్యవస్థ పునాది మీదే సాధ్యమవుతుంది అని పేర్కొంది.

**Gen Z ఉద్యమం.. టైమ్‌లైన్**

**4 సెప్టెంబర్ 2025**

నేపాల్ ప్రభుత్వం 26 సోషల్ మీడియా యాప్‌లపై నిషేధం విధించింది (Facebook, YouTube, Instagram, X, Reddit, Snapchat).

**కారణం:** కంపెనీలు స్థానికంగా నమోదు చేయకపోవడం, గ్రీవెన్స్ హ్యాండ్లర్ నియామకం చేయకపోవడం.

**8 సెప్టెంబర్ 2025**

Gen Z యువత పెద్ద ఎత్తున మైతీఘర్ మండల, న్యూ బనేశ్వర్ ప్రాంతాల్లో నిరసనలకు దిగారు.

పార్లమెంట్ ఆక్రమణ ప్రయత్నం, టీగాస్, వాటర్ కేనన్, రబ్బరు బుల్లెట్లుతో పోలీసుల స్పందన.

19 మంది మరణం, 300 మందికి పైగా గాయాలు.

సాయంత్రం: ప్రభుత్వం సోషల్ మీడియా నిషేధాన్ని వెనక్కి తీసుకుంది.

**హోం మంత్రి రమేష్ లేఖక్ రాజీనామా.**

**కర్ఫ్యూ:** కాఠ్మాండూ, పోఖరా, బిర్గంజ్, బుట్వాల్, భైరహవా, ఇటహరి, దమక్.

**9 సెప్టెంబర్ 2025**

ఉద్యమం దేశవ్యాప్తంగా విస్తరించింది, నిషేధం ఎత్తివేసినప్పటికీ నిరసనలు కొనసాగాయి.

ప్రధానమంత్రి కెపీ శర్మ ఓలి రాజీనామా చేసి శివపురి ఆర్మీ క్యాంప్‌లో ఆశ్రయం పొందారు.

పార్లమెంట్, సింగదుర్బార్, సుప్రీం కోర్ట్, సీతల్ నివాస్, బాలువటార్ వంటి ప్రభుత్వ భవనాలు దాడికి గురయ్యాయి. ఉమ్మెద్ పార్టీ, నెపాలి కాంగ్రెస్ ప్రధాన కార్యాలయాలు ధ్వంసం.

**నెపాల్ ఆర్మీ:** త్రిభువన్ అంతర్జాతీయ విమానాశ్రయంను నియంత్రణలోకి తీసుకుంది, విమాన సేవలు నిలిపివేత.


**10 సెప్టెంబర్ 2025**

అలర్లు కొనసాగుతున్నాయి, ప్రజల భద్రత కోసం ఆర్మీ చర్యలు. అధికారికంగా 23 మంది మరణించారు, ఇందులో 3 పోలీసు అధికారులు, ఝులానాథ్ ఖనాల్ భార్య కూడా ఉన్నారు. 347 మంది గాయపడినట్లు అధికారిక సమాచారం, 422+ అనధికారిక గణాంకం. నేపాల్ అధ్యక్షుడు రామ్ చంద్ర పౌడెల్, ఆర్మీ చీఫ్ జనరల్ అశోక్ రాజ సిగ్దెల్‌తో జనరేషన్ జెడ్ ఉద్యమ నిర్వాహకులు చర్చలు జరపాల్సి ఉంది. నేపాల్‌కు స్వాతంత్ర దినోత్సవమంటూ ప్రత్యేకంగా లేదు. ఎందుకంటే.. అది ఏ దేశపు పాలన కింద లేదు. కానీ 1923 డిసెంబర్ 21న నేపాల్‌బ్రిటన్ మధ్య Singha Durbar Treaty కుదిరింది. ఈ ఒప్పందం ద్వారా నేపాల్ స్వతంత్ర దేశంగా బ్రిటన్ అధికారికంగా గుర్తించింది. అయితే.. రాణా పాలన ముగిసిన ఫిబ్రవరి 18వ తేదీని ప్రజాస్వామ్య దినోత్సవం (Democracy Day)గా, రాచరికం ముగిసి ప్రజాస్వామ్యం ఏర్పడిన తేదీ మే 28వ తేదీని గణతంత్ర దినోత్సవం (Republic Day)గా నిర్వహిస్తోంది.

దఫదఫాలుగా రాజ్యాంగం..

1948లో గవర్నమెంట్ ఆఫ్ నేపాల్ యాక్ట్ ద్వారా తొలి రాజ్యాంగం అమల్లోకి వచ్చింది. అయితే అప్పటి రాణా, రాజకీయ సంస్కరణలకు నిరాకరించడంతో అది నామమాత్రంగానే ఉండిపోయింది. ఆ తర్వాత.. రాజు త్రిభువన్ బిర్ బిక్రమ్ షా 1951లో ఇంటీరియమ్ గవర్నమెంట్ ఆఫ్ నేపాల్ యాక్ట్ ప్రవేశపెట్టారు. ఇది ప్రజాస్వామ్యానికి మార్గం వేసింది. 1990లో ప్రజా ఉద్యమం తర్వాత.. కానిస్టిట్యూషనల్ మోనార్చీ అనేది బహుళ రాజకీయ పార్టీ వ్యవస్థకు మార్గం వేసింది. 2007లో ఇంటీరియమ్ కానిస్టిట్యూషన్ ఆఫ్ నేపాల్ అనేది రాచరికాన్ని పూర్తిగా తొలగించి.. ప్రజాస్వామ్య పునాది వేసింది. ఇది 2008లో రాజ్యాంగ సభ మొదలైన తర్వాత పూర్తిగా అమలులోకి వచ్చింది. అటుపై 2015 సెప్టెంబర్ 20న పూర్తిస్థాయి రాజ్యాంగం అమల్లోకి వచ్చింది. ఇది నేపాల్‌ను ఫెడరల్ డెమోక్రటిక్ రిపబ్లిక్‌గా ప్రకటించింది. నేపాల్ రాజ్యాంగం అనేది ఒక తరం పోరాటం ఫలితం. ఇది ప్రజల ఆకాంక్షలకు ప్రతిబింబంగా, దేశ భవిష్యత్తుకు పునాది రాయిగా ఉండాలని అంతా భావించారు. సోషల్ మీడియా బ్యాన్ నేపథ్యంలోనే నేపాల్ యువత ఆందోళనలు మొదలైనట్లు కనిపించినప్పటికీ.. రాజకీయ వారసత్వం, అవినీతిపైనే వాళ్ల పోరాటం సాగింది. ఈ నేపథ్యంలో నేపాల్ రాజ్యాంగం రాజకీయ నేతలకు అనుగుణంగా ఉందనేది ఇప్పుడున్న యువత అభిప్రాయం. అందుకే రేపటి తరం ఆకాంక్షలకు అనుగుణంగా రాజ్యాంగంలో సమూల మార్పు కోరుకుంటోంది.

# 60 మంది తలలు నరికిన ఐఎస్




**గోమా:** కాంగోలో ఇస్లామిక్ స్టేట్ (ఐఎస్)అనుబంధ ఉగ్ర సంస్థ జరిపిన దాడిలో 60 మంది ప్రజలు చనిపోయారు. సోమవారం రాత్రి నార్త్ కివు రాష్ట్రంలోని ఎన్‌టొయొలో శ్మశాన వాటిక వద్ద ఈ దారుణం చోటుచేసుకుంది. అలైడ్ డెమోక్రాటిక్ ఫోర్స్(ఏడీఎఫ్) ఉగ్రమూకలు పొడవాటి కత్తులతో అక్కడికి చేరుకుని, జనాన్ని ఒక చోటకు చేరుకోవాలని హుకుం జారీ చేశారు. వారందరి తలలను కత్తులతో నరికేశారు. కనీసం 60 మంది ఈ ఘటనలో చనిపోయినట్లు ప్రాథమిక సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. మృతుల సంఖ్య పెరిగే అవకాశాలున్నాయని ఆ ప్రాంత అధికారి ఒకరు తెలిపారు. కాంగో-ఉగాండా సరిహద్దుల్లోని ఈ ప్రాంతంలో ఏడీఎఫ్ దారుణాలకు తెగబడుతోంది. జూలైలో ఈ గ్రూపు ఇటురి ప్రావిన్స్‌లోని కొమండాలోని చర్చిపై జరిపిన దాడిలో 34 మంది, అంతకుముందు ఇరుములో జరిపిన దాడిలో 66 మంది ప్రాణాలు కోల్పోయారు.


# ఫ్రాన్స్‌లో బ్లాక్ ఎవ్రీథింగ్ ఉద్యమం

## 200 మందికి పైగా అరెస్టు

**పారిస్:** 'బ్లాక్ ఎవ్రీథింగ్' పేరుతో ఆందోళన చేస్తున్న నిరసన కారుల్ని ఫ్రాన్స్ నూతన ప్రధాని సెబాస్టియన్ లెకోర్ను అరెస్టు చేయిస్తున్నారు. ఇందుకోసం దేశ వ్యాప్తంగా భారీ ఎత్తున బలగాల్ని మోహరించారు. పలు వ్యవస్థల్ని స్తంభించేందుకు ప్రయత్నిస్తున్న వందలమందిని అదుపులోకి తీసుకుంటున్నారు. ఈ అరెస్టులను మరింత ముమ్మరం చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఫ్రాన్స్‌లో సైతం నేపాల్ తరహా రాజకీయ అనిశ్చితి నెలకొంది. ఈ ఏడాది ఆగస్టు నెలలో ప్రధాని ఫ్రాంకోయిస్ బేరౌ ఆ దేశ పార్లమెంట్‌లో బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఆ బడ్జెట్‌లో దేశ ప్రజల కోసం వివిధ పథకాల్లో కేటాయించే బడ్జెట్‌లో 43.8 బిలియన్ డాలర్లు కోత విధించారు. దీంతోపాటు రెండు రోజుల నేషనల్ హాలిడేస్‌ను రద్దుచేయడం, పెన్షన్లలో కోత విధిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ప్రధాని ఫ్రాంకోయి బేరౌ తీసుకున్న నిర్ణయం ఫ్రాన్స్ దేశప్రజల్లో తీవ్ర ఆగ్రహావేశాలను రగిల్చింది. ఆ బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ ఆగస్టు నెలలో సోషల్ మీడియా వేదికగా క్యాంపెయిన్‌లు నిర్వహించారు. ఆ తర్వాత చాపకింద నీరులా సెప్టెంబర్ నెలనుంచి బహిరంగంగా ఆందోళన బాటపట్టారు. 'బ్లాక్ ఎవ్రీథింగ్' పేరుతో మొదలు పెట్టిన ఆందోళన తారాస్థాయికి చేరింది. రవాణా, విద్యుత్, కమ్యూనికేషన్ వ్యవస్థలను స్తంభింపచేసే లక్ష్యంగా నిరసల్ని మరింత ఉధృతం చేశారు. ఫలితంగా ఫ్రాన్స్‌లో రాజకీయ అనిశ్చితి నెలకొంది. ప్రభుత్వం కూలిపోయే ప్రమాదం ఉందని భావించిన ఫ్రాన్స్ ప్రెసిడెంట్ ఇమ్మాన్యుయేల్ మెక్రాన్.. ప్రధాని ఫ్రాంకోయిస్ బేరౌను పదవి నుంచి తొలగించారు. నూతన ప్రధానిగా సెబాస్టియన్ లెకోర్ను నియమించారు. ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన సెబాస్టియన్ లెకోర్ను.. ఆందోళనల్ని అరికట్టేందుకు ఎక్కడిక్కడే ఆందోళన కారుల్ని అరెస్టు చేస్తున్నారు. అరెస్టులు, భద్రతా చర్యలు నిరసనల నేపథ్యంలో దేశవ్యాప్తంగా భద్రతా బలగాలను మోహరించారు. పారిస్ సహా ప్రధాన నగరాల్లో పోలీసులు భారీగా మోహరించి, శాంతి భద్రతలు కాపాడేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటివరకు 200 మందికి పైగా అరెస్టు కాగా, మరిన్ని అరెస్టులు జరిగే అవకాశం ఉందని సమాచారం. నూతన ప్రధానిగా పదవీ బాధ్యతలు చేపట్టిన సెబాస్టియన్ లెకర్నో స్పందించారు.దేశంలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులపై స్పందించారు. ప్రజల ఆందోళనలను అర్థం చేసుకుంటామని, శాంతియుతంగా పరిష్కారం కోసం ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు.



# సౌదీ ఎడారిలో యాక్షన్



అల్లు అర్జున్‌అట్లీ కాంబినేషన్‌లో భారీ పాన్ వరల్డ్ చిత్రం తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. 'పుష్ప2' తర్వాత అల్లు అర్జున్ చేస్తున్న చిత్రమిదే కావడంతో ప్రకటన రోజు నుంచే ఈ సినిమాపై దేశవ్యాప్తంగా హైప్ క్రియేట్ అయింది. ప్రముఖ నిర్మాణ సంస్థ సన్‌పిక్చర్స్ నిర్మిస్తున్న ఈ సినిమా ముంబైలో ఓ షెడ్యూల్ పూర్తిచేసుకుంది. సైన్స్‌ఫిక్షన్ కథతో అంతర్జాతీయ స్థాయి గ్రాఫిక్స్, విజువల్ ఎఫెక్ట్స్‌తో ఈ సినిమాకు రూపకల్పన చేస్తున్నారు. ఇంటర్నేషనల్ ఆడియెన్స్ టార్గెట్‌గా రూపొందిస్తున్న ఈ సినిమా షూటింగ్ లొకేషన్స్ విషయంలో దర్శకుడు అట్లీ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారట. ప్రస్తుతం లొకేషన్ రెక్కీలో భాగంగా ఆయన సౌదీ అరేబియాలో ఉన్నారు. అక్కడి లివా ఎడారుల్లో సరైన లొకేషన్స్ కోసం అన్వేషిస్తున్నారు. దీనికి సంబంధించిన వీడియోను అట్లీ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పంచుకున్నారు. తదుపరి షెడ్యూల్‌ను సౌదీలోనే తెరకెక్కించడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రంలో దీపికా పడుకోన్ కథానాయికగా నటిస్తున్నది.

# రూ. 200 కోట్ల క్లబ్‌లో లోక



మలయాళం నుంచి వచ్చిన 'లోకా: చాప్టర్ 1 - చంద్ర' సినిమా బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులను సృష్టిస్తోంది. నటుడు దుల్కర్ సల్మాన్ నిర్మించిన ఈ చిత్రం కేవలం రూ. 30 కోట్ల బడ్జెట్‌తో రూపొంది విడుదలైన వారం రోజుల్లోనే రూ.101 కోట్ల వసూళ్లు రాబట్టి సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. తాజాగా ఈ చిత్రం మరో అరుదైన రికార్డును అందుకుంది. ఈ చిత్రం విడుదలైన కేవలం 13 రోజుల్లోనే రూ. 202 కోట్ల వసూళ్లను రాబట్టినట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ సందర్భంగా కొత్త పోస్టర్‌ను పంచుకుంది. మరోవైపు ఈ సినిమాతో రూ. 200 కోట్ల క్లబ్‌లో చేరిన తొలి హీరోయిన్ లీడ్ మూవీగా రికార్డు సృష్టించింది. దర్శకుడు డామినిక్ అరుణ్, మలయాళ జానపద కథకు సూపర్ ఉమెన్ కథాంశాన్ని జోడించి ఈ సినిమాను రూపొందించారు. కళ్యాణి ప్రియదర్శన్ సూపర్ ఉమెన్‌గా ప్రధాన పాత్రలో నటించగా, నస్లెన్ కె. గఫూర్ కథానాయకుడిగా నటించారు. ఈ సినిమా కేవలం మలయాళంలోనే కాకుండా తెలుగు, తమిళం, హిందీ భాషల్లో కూడా మంచి వసూళ్లు సాధిస్తోంది. ఈ సినిమాకు అద్భుతమైన విజయం రావడంతో 'లోకా' యూనివర్స్‌లో మొత్తం ఐదు భాగాలు ఉంటాయని దర్శకుడు ప్రకటించారు.



# చందూ మొండేటి కొత్త సినిమా వాయుపుత్ర..

చందూ మొండేటి దర్శకత్వంలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తున్న ఈ చిత్రం.. చరిత్ర, భక్తి, ఆధునిక దృశ్యాల యొక్క ఉత్కంఠభరితమైన కలయికను హామీ ఇస్తుంది. భారీస్థాయిలో 3D యానిమేషన్ చిత్రంగా రూపుదిద్దుకుంటున్న 'వాయుపుత్ర', హనుమంతుని కాలాతీత కథను గొప్ప దృశ్యకావ్యంగా ప్రేక్షకుల ముందుకు తీసుకురానుంది. 2026 దసరాకు తెలుగు, హిందీ, తమిళం, మలయాళం, కన్నడ భాషలలో ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో అడుగుపెట్టనుంది. ఈ చిత్ర ప్రకటన సందర్భంగా విడుదల చేసిన పోస్టర్ ఆకట్టుకుంటోంది. హనుమంతుడు కొండపై నిలబడి, దహనమవుతున్న లంకను చూస్తున్న శక్తివంతమైన పోస్టర్.. ఈ సినిమా అందించాలనుకుంటున్న ఇతిహాస స్థాయి, ఆధ్యాత్మిక లోతును సంపూర్ణంగా సంగ్రహిస్తుంది. ఇది కేవలం సినిమా కాదు, థియేటర్లను దేవాలయాలుగా మార్చే పవిత్ర దృశ్యం. మునుపెన్నడూ లేని విధంగా భక్తి పారవశ్యంలో ముంచేయడానికి ప్రేక్షకులను ఆహ్వానిస్తోంది. 'వాయుపుత్ర' ఒక సినిమాటిక్ మైలురాయిగా, విశ్వాసం, శౌర్యం, విధి వేడుకగా మారనుంది. కథకుడిగా చందూ మొండేటి దార్శనికత, నిర్మాతగా నాగవంశీ నైపుణ్యంతో 'వాయుపుత్ర' భారతీయ సినిమాని పునర్నిర్వచించటానికి సిద్ధంగా ఉంది. హృదయపూర్వక కథనాన్ని అద్భుతమైన 3D యానిమేషన్ విజువల్స్‌తో మిళితం చేసి, మన అత్యంత గౌరవనీయమైన సాంస్కృతిక చిహ్నాలలో ఒకటైన ప్రపంచంలోకి ప్రేక్షకులను తీసుకెళ్లనుంది. 'వాయుపుత్ర' చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో వెల్లడి కానున్నాయి.

# 'మన శంకరవరప్రసాద్ గారు' సెట్స్‌లో చిరుని కలిసిన 'పూరిసేతుపతి' టీమ్



అగ్ర దర్శకుడు పూరి జగన్నాథ్ దర్శకత్వంలో రూపొందుతున్న తాజా ప్రాజెక్ట్ 'పూరి సేతుపతి'. విజయ్ సేతుపతి హీరోగా రాబోతున్న ఈ ప్రాజెక్ట్‌లో టబు హీరోయిన్‌గా నటిస్తుంది. ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్ శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుండగా.. తాజాగా ఈ చిత్రయూనిట్ మెగాస్టార్ చిరంజీవిని కలుసుకుంది. మెగాస్టార్ చిరంజీవి ప్రస్తుతం అనిల్ రావిపూడితో కలిసి మన శంకరవరప్రసాద్ గారు అనే సినిమాను తెరకెక్కిస్తున్నాడు. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతుండగా.. ఈ సినిమా పక్కనే షూటింగ్ జరుపుకుంటున్న 'పూరి సేతుపతి' టీమ్ చిరుని కలుసుకుని ఆశీస్సులు తీసుకుంది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన ఫొటోను చిత్రబృందం ఎక్స్ వేదికగా పంచుకుంది. ఇందులో నటులు చిరంజీవితో పాటు విజయ్ సేతుపతి, టబు, నయనతార, ఛార్మీ తదితరులు ఉన్నారు.

# చిక్కుల్లో హీరోయిన్ నయనతార



హీరోయిన్ నయనతార చిక్కుల్లో పడింది. తన డాక్యుమెంటరీ నయనతార : బియాండ్ ది ఫెయిరీటేల్ డాక్యుమెంటరీ ప్రముఖ ఓటీటీ ప్లాట్ ఫామ్ నెట్ ఫిక్స్ లో విడుదలైన విషయం తెలిసిందే. అయితే ఆ డాక్యుమెంటరీలో నిర్మాతల అనుమతి లేకుండానే చంద్రముఖి సినిమా క్లిప్ వినియోగించడంపై హైకోర్టును ఆశ్రయించారు. దీంతో ఈ విషయంపై నయనతార, నెట్‌ఫ్లిక్స్‌కు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. అక్టోబర్ 6 లోపు సమాధానం ఇవ్వాలని ఆదేశించింది. ఈ డాక్యుమెంటరీని డార్క్ స్టూడియో నిర్మించింది. ఇది నవంబర్ 2024లో నెట్‌ఫ్లిక్స్ ఓటీటీ ప్లాట్ ఫామ్ లో స్ట్రీమింగ్ అవుతుంది. నటుడు ధనుష్ తరపున మద్రాస్ హైకోర్టులో కేసు దాఖలు చేశారు. నానుమ్ రౌడీటన్ తన వండర్‌బార్ నిర్మాణ సంస్థ అనుమతి లేకుండా ఈ చిత్రంలోని ఫుటేజ్‌లను ఉపయోగించారని ఆరోపిస్తూ కేసు నమోదు చేశారు. ప్రస్తుతం ఈ కేసు ఇంకా పెండింగ్ లోనే ఉంది. ఈ చిత్రం కాపీరైట్‌ను కలిగి ఉన్న AP ఇంటర్నేషనల్, నయనతార ఈ డాక్యుమెంటరీలో అనుమతి లేకుండా చంద్రముఖి చిత్రంలోని ఫుటేజ్‌లను ఉపయోగించారని ఆరోపిస్తూ మద్రాస్ హైకోర్టులో కేసు దాఖలు చేసింది. చంద్రముఖి ఫుటేజ్‌ను డాక్యుమెంటరీ నుండి తొలగించాలని, సినిమా ద్వారా వచ్చిన లాభాన్ని సమర్పించాలని, రూ.5 కోట్ల పరిహారం చెల్లించాలని పిటిషన్‌లో డిమాండ్ చేశారు. ఈ విషయానికి సంబంధించి నోటీసు పంపినప్పటికీ, ఆ ఫుటేజ్‌ను ఇప్పటికీ డాక్యుమెంటరీలో ఉపయోగిస్తున్నారని కూడా ఆరోపణలు ఉన్నాయి. ఈ కేసును న్యాయమూర్తి సెంథిల్‌కుమార్ ముందు విచారించారు. ఆ సమయంలో, ఈ అంశంపై చర్చలు జరుగుతున్నాయని డార్క్ స్టూడియో వాదించింది. అయితే, పిటిషనర్ ఇప్పటివరకు ఎటువంటి సమాచారం అందలేదని , ఎటువంటి సమాధానం దాఖలు చేయలేదని అన్నారు. న్యాయమూర్తి డార్క్ స్టూడియోకు సమాధానం దాఖలు చేయడానికి అక్టోబర్ 6 వరకు సమయం ఇచ్చి, విచారణను ఆ రోజుకు వాయిదా వేశారు.





# తండ్రయిన వరుణ్ తేజ్

## పండంటి మగబిడ్డకు జన్మనిచ్చిన లావణ్య త్రిపాఠి

టాలీవుడ్ స్టార్ దంపతులు వరుణ్ తేజ్ లావణ్య త్రిపాఠి పేరెంట్స్‌గా ప్రమోషన్ పొందారు. లావణ్య బుధవారం ఉదయం హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. దీంతో మెగా ఫ్యామిలీ ఇంట ఆనందాలు వెల్లివిరిశాయి. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు. మరోవైపు చిరంజీవి కూడా 'మన శంకరవరప్రసాద్‌గారు' మూవీ సెట్స్ నుంచి నేరుగా ఆస్పత్రికి వెళ్లి వరుణ్ లావణ్యకు శుభాకాంక్షలు తెలిపారు. అటు అభిమానులు, సెలబ్రిటీలు సైతం సోషల్ మీడియా వేదికగా వరుణ్ జంటకు విషెస్ చెప్తున్నారు.

**లవ్ మ్యారేజ్**

వరుణ్‌లావణ్యలది ప్రేమ వివాహం. 2017లో మిస్టర్ సినిమాలో తొలిసారి జంటగా నటించారు. తర్వాత అంతరిక్షంలోనూ యాక్ట్ చేశారు. ఈ సినిమాల సమయంలోనే వీరి మధ్య స్నేహం బలపడింది. అది ప్రేమగా మారడంతో కొంతకాలం డేటింగ్‌లో ఉన్నారు. తర్వాత పెద్దలనొప్పించి 2023 నవంబర్ 1న పెళ్లి చేసుకున్నారు. సినిమాల విషయానికి వస్తే.. వరుణ్ తేజ్ చివరగా గతేడాది మట్కా సినిమాలో కనిపించాడు. ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్‌గా నిలిచింది. ప్రస్తుతం #VT15 అనే వర్కింగ్ టైటిల్‌తో ఓ సినిమా చేస్తున్నాడు. మేర్లపాక గాంధీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో రితికా నాయక్ హీరోయిన్. యువీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థలు నిర్మిస్తున్న ఈ మూవీ వచ్చే ఏడాది రిలీజ్ కానున్నట్లు తెలుస్తోంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com